నేటి కందం-నేటికి అందం

చెన్నయి మెట్రో రైలు స
మున్నతమగు దశకు చేరి మోడీ చేతన్
తిన్నగ వడపళని వరకు
మిన్నగ పొడిగింప బడియె మేలిడ ప్రజకున్ !!

(చెన్నయి లోని మెట్రో రైలు రెండవ దశ వడపళని వరకు పొడిగింపబడి ప్రధాని నరేంద్ర మోడీ గారిచే ప్రారంభించబడింది. ఇది ఎంతో ఉపయోగకరంగా ఉ ఒటుందని ఆ ప్రాంత ప్రజలు సంతోషిస్తున్నారు.)

-రాధశ్రీ

సెల్:9494481210





# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com



చురక

మసి పూతల ముఖాలే
మన నేతల రూపాలు
అద్దం ఏ పార్టీదయినా
అవి మలగని పాపాలు.
అవినీతి నేర ఘోర
అక్రమాల రంగు కళ
ఎంతేసినా మేకప్పు
ఎటుపోదు దాని జల

-వేల్పుల నారాయణ

9440433475





హైదరాబాద్ మంగళవారం 13-10-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026.Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:62 పేజిలు:6 వెల: రూ.1/-


## మోదీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోంది: మంత్రి ధ్వజం



న్యూఢిల్లీ, అక్టోబర్ 12: సర్(ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ) ప్రక్రియ ద్వారా అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు కేంద్ర ఎన్నికల సంఘంపై విమర్శలు చేశారు. ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే పిలుపుతో ఢిల్లీలో నిరసనకు దిగారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించే ప్రయత్నం చేస్తామని కాంగ్రెస్ నేతలు తెలిపారు.

**అర్హులైన ఓటర్లను సీఈసీ తొలగించింది: మంత్రి శ్రీధర్‌బాబు**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్కారుపై తెలంగాణ మంత్రి శ్రీధర్‌బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సర్' ఉపయోగించుకొని బీజేపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించిందని.. అర్హులైన ఓటర్లను తొలగించిందని ధ్వజమెత్తారు. బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని ఫైర్ అయ్యారు. ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాలో తెలంగాణ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. సర్‌ను రద్దు చేయాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పిలుపునిచ్చారని వ్యాఖ్యానించారు. సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుందని ఆగ్రహించారు. ఎన్నికల కార్యాలయం పక్షపాతం చూపిస్తోందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాహుల్ గాంధీ మల్లికార్జున ఖర్గే, పిలుపుతో ప్రజాస్వామ్య గొంతును వినిపించేందుకు తాము ఢిల్లీ వచ్చామని తెలిపారు. కేంద్రం, సీఈసీపై తమ నిరసన తెలియజేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

**ఆయా రాష్ట్రాల్లో దొంగదారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోంది: మంత్రి శ్రీహరి**

బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీ చేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్యుడి ఓటు హక్కును కాపాడేలా తాము పోరాటం చేస్తున్నామని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ పిలుపుమేరకు తాము ఢిల్లీకి వచ్చామని వెల్లడించారు. 'సర్' ద్వారా ఓట్లు తొలగించి.. ఆయా రాష్ట్రాల్లో అధికారంలోకి రావాలని మోదీ సర్కార్ ప్రయత్నిస్తోందని ధ్వజమెత్తారు. అన్ని చోరీలు అయిపోయాయని.. ఇప్పుడు ఓట్ల చోరీ చేస్తోందని ఆగ్రహించారు. దొంగ దారిన అధికారంలోకి రావాలని బీజేపీ ప్రయత్నిస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి దుయ్యబట్టారు.

**సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు ఆందోళన చేస్తాం: మహేశ్ గౌడ్**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే వరకు తాము ఆందోళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మోదీ, అమిత్ షా 'సర్'ను వాడుకొని ఎన్నికల్లో గెలిచారని ధ్వజమెత్తారు. అధికారంలో ఎప్పటికీ ఉండాలనే ఆకాంక్షతో ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు ఇంత పెద్దఎత్తున ఆందోళన చేస్తున్నా.. వారు కనీసం స్పందించట్లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లాల అధ్యక్షులు అందరూ ఢిల్లీకి వచ్చి పోరాటం చేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు వరకు మార్చ్ నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యంలో ఓటును తొలగించడం తప్పు: ఎంపీ చామల**

ప్రజాస్వామ్యంలో ఓటును తొలగించడం తప్పు అని కాంగ్రెస్ భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ బీజేపీకి వత్తాసు పలుకుతూ అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. బీజేపీ కార్యకర్తలను ఎన్నికల కమిషనర్లుగా తీసుకువచ్చి కేంద్ర ఎన్నికల సంఘంలో కూర్చోబెట్టారని మండిపడ్డారు. 50 ఏళ్లు అధికారంలో ఉండాలనే పిచ్చి ఆలోచనతో బీజేపీ ఇలాంటి పనులు చేసిందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు.

## సుప్రీం కోర్టు తలుపులు తెరిచే ఉంటాయ్: చీఫ్ జస్టిస్



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12:సుప్రీం కోర్టు తలుపులు అందరికీ తెరిచే ఉంటాయని చీఫ్ జస్టిస్ సూర్య కాంత్ తాజాగా వ్యాఖ్యానించారు. అయితే, ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రతిపక్షాలతో సమావేశం కాలేనని నిస్సహాయత వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ అంశం కోర్టు పరిధిలో ఉందని అన్నారు. అయితే, ఈ విషయంలో ప్రతిపక్షాలు కోర్టులో పిటిషన్ వేయవచ్చని చెప్పారు. సర్ ప్రక్రియపై చర్చించేందుకు అనుమతిని కోరుతూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ నిన్న లేఖలు రాసిన విషయం తెలిసిందే. ఓటు చోరీకి ఫుల్ స్టాప్ పడటం, సీఈసీ రాజీనామా, సర్ ప్రక్రియకు ముగింపు పలకాలన్న అభ్యర్థనలతో వినతిపత్రం ఇచ్చేందుకు సమయం కోరారు.'వారి నుంచి నాకు లేఖ వచ్చింది. ఆ రాత్రే నేను ప్రత్యుత్తరం ఇచ్చాను. మీటింగ్ ఎందుకు కుదరదో కారణాలను కూడా వివరించాను. సుప్రీం కోర్టు తలుపులు ప్రతి ఒక్కరికీ తెరిచే ఉంటాయి. ప్రభుత్వ సంస్థల నుంచి సామాన్య పౌరుల వరకూ ప్రతి ఒక్కరూ సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చు. ప్రతి పౌరుడికీ ఈ హక్కు ఉంటుంది. వారి అభ్యంతరాలను విని చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాము' అని అన్నారు. జాతీయ మానవహక్కుల సంస్థ 33వ వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిన అంశాలపై న్యాయప్రక్రియల ద్వారా దృష్టిసారించడం మెరుగ్గా ఉంటుందని చీఫ్ జస్టిస్ తన లేఖలో అభిప్రాయపడ్డట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మరోవైపు, కాంగ్రెస్ నేడు ఛలో ఢిల్లీ – మార్చ్ ఫర్ డెమోక్రసీ కార్యక్రమాన్ని తలపెట్టింది. పార్టీలు, కులాలకు అతీతంగా ఈ కార్యక్రమం జరుగుతోందని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## ద్రవ్యోల్బణం, వినియోగంపై పరిశోధన.. ఆర్థిక శాస్త్ర నోబెల్ బహుమతి పొందిన రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12: 2026 ఆర్థిక శాస్త్రాల నోబెల్ బహుమతికి సంబంధించి రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ కీలక ప్రకటన చేసింది. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సంబంధించిన సూక్ష్మ ఆర్థిక పునాదులపై చేసిన కృషికి రాబర్ట్ ఈ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లకుర్ల్ఫ్రెడ్ నోబెల్ స్మారకార్థం స్వెరిజెస్ రిక్స్‌బ్యాంక్ ఆర్థిక శాస్త్రాల బహుమతిని ప్రదానం చేయాలని నిర్ణయించారు.

ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, వినియోగం వంటి స్థూల ఆర్థిక అంశాల మధ్య గణాంక సంబంధాలకే పరిమితం కాకుండా, వ్యక్తులు, కుటుంబాలు, వ్యాపార సంస్థల నిర్ణయాలు మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతాయనే అంశంపై ఈ పరిశోధన దృష్టి సారించింది. సూక్ష్మ ఆర్థిక పునాదుల ఆధారంగా స్థూల ఆర్థిక నమూనాలను రూపొందించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పనితీరును మరింత సమగ్రంగా అర్థం చేసుకునే మార్గాన్ని ఈ విధానం చూపిస్తుంది.ఆర్థిక వ్యవస్థలో స్థిరత్వాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు అనుసరించే విధానాలను అర్థం చేసుకోవడంలో స్థూల ఆర్థిక నమూనాలు కీలక పాత్ర పోషిస్తాయి. వ్యక్తిగత కుటుంబాలు, వ్యాపార సంస్థలు తీసుకునే నిర్ణయాలను ఈ నమూనాల్లో పరిగణనలోకి తీసుకోవడం ద్వారా ద్రవ్యోల్బణం, ఉత్పత్తి, వినియోగం వంటి అంశాల మధ్య సంబంధాలను మెరుగ్గా విశ్లేషించవచ్చు. ఆర్థిక స్థిరీకరణ విధానాల రూపకల్పనలో ఈ పరిశోధనా విధానం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



సంగారెడ్డి, అక్టోబర్ 12(నేటి నిజం ప్రతినిధి)ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు పాండు, సంగీత అధికారులను ఆదేశించారు.

సోమవారం సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 69 అర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

డివిజన్ల వారీగా సంగారెడ్డి నుండి 15, నారాయణఖేడ్ నుండి 2, జహీరాబాద్ నుండి 2 అర్జీలు అందగా, కలెక్టరేట్‌లో 50 అర్జీలు స్వీకరించారు. అందోల్ డివిజన్ నుండి ఎలాంటి అర్జీలు అందలేదు. ప్రజలు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలపై అర్జీలు సమర్పించాలని అదనపు కలెక్టర్లు సూచించారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వసంతకుమారి, హౌసింగ్ పీడీ చలపతిరావు, అదనపు డీఆర్డీఓ బాలరాజ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ తుల్జా నాయక్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అడ్వకేట్ ఆర్. గౌతమి, గ్రామీణ నీటి సరఫరా శాఖ ఈఈ ఎస్.కె. పాషా, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలి

### -కీలక విషయాలను వెల్లడించిన పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్ 12:ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ఛార్జీలను పునఃపరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇటీవల ప్రారంభించిన కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయంటూ ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ప్రజలకు ఆర్థిక భారం కాకుండా, అందుబాటులో ఉండే ధరలను నిర్ణయించే అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని పేర్కొన్నారు.

ప్రస్తుతం రోజువారీ కామన్ పాస్ ధర రూ.400గా ఉంది. ఇందులో మెట్రో వాటా రూ.300 కాగా, ఆర్టీసీ వాటా రూ.100గా నిర్ణయించారు. అదేవిధంగా నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా ఉండగా, ఇందులో మెట్రో వాటా రూ.7,000, ఆర్టీసీ వాటా రూ.1,500గా ఉంది. అయితే ఈ ధరలు సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులకు భారంగా మారుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచనల మేరకు కామన్ పాస్ ఛార్జీలను సమీక్షించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఛార్జీలపై పునఃపరిశీలన చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ అంశంపై త్వరలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి, తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు ఆర్టీసీ, మెట్రో సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకునేలా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ప్రయాణికులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరేలా, వారి అవసరాలకు అనుగుణంగా సౌకర్యవంతమైన ధరలతో కామన్ పాస్ విధానం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రజలపై అదనపు ఛార్జీల భారం మోపడం ప్రభుత్వ ఉద్దేశం కాదని, ప్రయాణికుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని త్వరలోనే తగిన నిర్ణయం ప్రకటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు

## మద్యం మత్తులో కారు నడిపి స్కూటీని ఢీకొట్టిన యువకుడు.. ముగ్గురు దుర్మరణం..!



న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12: మద్యం మత్తులో వేగంగా కారు నడిపిన ఓ యువకుడు బలంగా స్కూటీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. ఆదివారం తెల్లవారుజామున కేరళం రాష్ట్రం కొచ్చి లోని నెడుంబాస్సేరి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది.

మరణించిన వారిని వయనాడ్‌లోని మడక్కిమలకు చెందిన దేవిక, మంగళూరులోని సుల్లియాకు చెందిన ఇజాజ్, పాలక్కాడ్‌లోని కరింబాకు చెందిన గోపికగా గుర్తించారు. 21 ఏళ్ల వయసున్న వీరు ముగ్గురూ కొచ్చిలోని త్రికక్కరలో హ్యాండ్లూమ్ సేల్స్ సంస్థలో పనిచేస్తున్నారు. వారు టీ తాగడానికి బయటకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

పోలీసుల వెల్లడించిన కథనం ప్రకారం.. నిందితుడు సుహైల్ సజీవ్ తన ఃఓచి మినీ కూపర్ కారులో స్నేహితులను తీసుకురావడానికి నెడుంబాసేరి విమానాశ్రయానికి వెళుతుండగా ఒక స్కూటీని ఢీకొట్టాడు. ఆ వాహనాన్ని దాదాపు 100 మీటర్ల దూరం వరకు రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి ఆపాడు. సుహైల్ అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నిం చేయగా.. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

ప్రమాదానికి ముందు సుహైల్ మూడు బార్లలో మద్యం సేవించినట్లు పోలీసులు గుర్తించారు. అతను ఏదైనా డ్రగ్ ప్రభావంతో వాహనం నడిపాడా లేదా అని నిర్ధారించుకోవడానికి అతనికి బ్లడ్ రిపోర్ట్స్ కోసం చూస్తున్నారు. ఆ 19 ఏళ్ల యువకుడికి మద్యం అమ్మిన బార్ల నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ మంత్రి ఎం లిజు ఆదేశించారు.


బాల గోకులం

దశ పంచమ: వార్షికోత్సవం

(బాలల సాహిత్య సాంస్కృతిక సంస్థ)

తెలంగాణా ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మరియు
"బాల గోకులం" బాలల సాహిత్య సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో
"బాల గోకులం" దశ పంచమ: వార్షికోత్సవం వేడుకలు.

సమయం: 10-10-2026 శనివారం సాయంత్రం గం॥ 5.30 ని॥లకు

వేదిక: రవీంద్రభారతి - సమావేశ మందిరం, ఎ.సి. హాలు, మొదటి అంతస్తు, హైదరాబాదు.

ముఖ్య అతిథి & ఆవిష్కర్త : శ్రీ మణికొండ వేదకుమార్, ఛైర్మన్, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్.
సభాధ్యక్షులు : శ్రీ పత్తిపాక మోహన్, దక్షిణప్రాంత అధికారి, ఎన్.బి.టి.
విశిష్ట అతిథి : శ్రీ చొక్కాపు వెంకటరమణ, కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత
ఆత్మీయ అతిథులు : శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి, ప్రముఖ రచయిత్రి; శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి, అక్షరయాన్ ఫౌండర్
సమన్వయం
అవార్డీల పరిచయం : శ్రీ పైడిమర్రి రామకృష్ణ, ప్రముఖ రచయిత
ప్రార్థన, స్వాగతం : శ్రీమతి తిమ్మరాజు హేమలత
నాందీ ప్రస్తావన : "సాహిత్యశ్రీ" ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, వ్యవస్థాపక అధ్యక్షురాలు 'బాల గోకులం'
పుస్తకావిష్కరణ : కర్నాటి గేయాలు, డా॥ కర్నాటి లింగయ్య
కార్యక్రమం : కేం.సా.అ. బాలసాహిత్య పురస్కార గ్రహీత కీ॥శే॥ రెడ్డి రాఘవయ్య గారి ద్వితీయ బాల సాహిత్య పురస్కారం & సత్కారం
గ్రహీత : శ్రీమతి కొల్లూరు స్వరాజ్యం వెంకట రమణమ్మ, బాలబాట ఎడిటర్; డా॥ శ్రీ బెల్లం కొండ నాగేశ్వరరావు, సాహితీ స్వర్ణోత్సవ పురస్కార సత్కారం
బాలప్రియ అవార్డు గ్రహీతలు : శ్రీ విద్వాన్ చొప్పా వీరభద్రప్ప, ప్రముఖ బాలసాహిత్య రచయిత; శ్రీ కాశీ విశ్వనాథం పట్రాయుడు, ప్రముఖ బాలసాహిత్య రచయిత; శ్రీమతి పురిమళ్ళ సునంద, ప్రముఖ బాలసాహిత్య రచయిత్రి; శ్రీ గద్వాల సోమన్న, శతాధిక గ్రంథకర్త
అనీల ఆర్ట్స్ అకాడమీ బాలల బృంద నృత్యాలు

అందరూ ఆహ్వానితులే

శ్రీ ఆకెళ్ల వెంకట సుబ్బారావు, చీఫ్ ప్యాట్రన్ బాల గోకులం
ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి, బాలగోకులం వ్యవస్థాపక అధ్యక్షురాలు



ఆహ్వానము

జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్

ప్రపంచరికార్డులు నెలకొల్పిన శ్రీ త్యాగరాయ గానసభ

శ్రీ పాత్తూరి సుబ్బారావు రచించిన పదిహేనవ పుస్తకం
'మనుష్యులూ మనస్తత్వాలు' ఆవిష్కరణ
విన్నవి కన్నవి అనుకున్నవి కథలు కథలుగా.......



ముఖ్యఅతిథి : డా॥కె.వి.రమణాచారి ఐ.ఎ.ఎస్.(రి), తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : డా॥పులివర్తి కృష్ణమూర్తి, ఆధ్యాత్మిక రచయిత
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్ధనమూర్తి, అధ్యక్షులు - శ్రీ త్యాగరాయ గానసభ
ఆత్మీయ అతిథి : డా॥వై.రామకృష్ణారావు, సాహితీవేత్త
సభాప్రారంభకులు : శిరోమణి డా॥వంశీ రామరాజు, వ్యవస్థాపకులు-వంశీ సంస్థలు
ప్రత్యేక అతిథి : శ్రీ మార్ని జానకిరామ చౌదరి, అధ్యక్షులు -సాహితీస్రవంతి,కాకినాడ
శుభాకాంక్షలు : శ్రీమతి జ్యోతి వలబోజు, రచయిత్రి, పబ్లిషర్
సభానిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు, సాహితీకిరణం సలహాదారులు



'విజయ సాధన' అనే అంశంపై కవి సమ్మేళనం
నిర్వహణ : డా॥ పి.లలితవాణి, సాహితీవేత్త

పాల్గొనే కవులు, కవయిత్రులు
శ్రీ మౌనశ్రీ మల్లిక్, శ్రీ ఎన్వీ రఘువీర్ ప్రతాప్, శ్రీమతి శిష్ట్లా మాధవి, శ్రీమతి గడ్డం సులోచన
శ్రీమతి ఎ.అలివేణి,శ్రీమతి చీదెళ్ళ సీతాలక్ష్మి, శ్రీ పరిమి వెంకట సత్యమూర్తి, శ్రీ టి.వి.స్వామి,
శ్రీమతి పేరి అన్నపూర్ణ, శ్రీ కడియాల ప్రభాకర రావు, శ్రీమతి జె.నాగరాజ్యలక్ష్మి, శ్రీ సత్యం గంజి,
శ్రీ ఎర్వా వెంకటేశం శ్రీ ఉప్పల రాధాకృష్ణ, శ్రీమతి గూడూరి విజయలక్ష్మి, శ్రీ పొన్నం రాజయ్యగౌడ్,
శ్రీమతి యం.అరుణకుమారి, శ్రీమతి ఆచంట అంజని, శ్రీ ఆచంట సుధాకర్, డా॥హిమ కిరణ్ పొత్తూరి

తేది:16.10.2026,శుక్రవారం, సా॥5.00గం॥లకు,
వేదిక:కళా సుబ్బారావు కళావేదిక(శ్రీ త్యాగరాయ గానసభ)
చిక్కడపల్లి, హైదరాబాద్

జి.వి.ఆర్. ఆరాధన కల్చరల్ ఫౌండేషన్, లయన్ వి.వి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి
శ్రీ త్యాగరాయ గానసభ, శ్రీమతి కళాశారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి

# విపత్తుల పట్ల అప్రమత్తత ఇంట్లోంచే ప్రారంభం కావాలి

## (13 అక్టోబర్ "అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం" సందర్భంగా)

ప్రకృతి వైపరీత్యాలు జరుగుతూనే ఉంటాయి. కనీసం శతాబ్దానికి ఒకసారి కరోనా లాంటి మహమ్మారులు చుట్టు ముడుతూనే ఉండవచ్చని వింటున్నాం. ప్రకృతి వైపరీత్యాలను ముందు ఊహించడం చాలా సందర్భాలలో వీలు కాదు. మానవ తప్పిదాలతో ప్రాణ ఆస్థినష్టాలు తరుచుగా చూస్తున్నాం. గతంలో విశాఖపట్నం సమీప వెంకటాపురం గ్రామంలో యల్‌జి పాలిమర్స్ పరిశ్రమ నుండి విడుదలైన స్టైరిన్ వాయు లీకేజీ కారణంగా 11 మంది మరణించగా, 1000కి పైగా ప్రజలు తీవ్ర అనారోగ్యం పాలైనారు. ఈ మానవ నిర్లక్ష్యానికి 3 కిమీ పరిధిలోని ఐదు గ్రామాలు ప్రభావితం కాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కోటి రూపాయల పరిహారంతో పాటు పునరావాసానికి 30 కోట్లు కేటాయించాల్సి వచ్చింది. ఇలాంటి సహజ/మానవ కారణ విపత్తులు జరిగినపుడు ఆస్థి ప్రాణనష్టాలను తగ్గించే ప్రయత్నాలు చేయడం, ఉపశమన చర్యలు తెలుసుకోవడం, క్షతగాత్రులను రక్షించి వైద్య సదుపాయాలు కల్పించడం, విపత్తు ప్రమాద నిర్వహణలో సుశిక్షితులైన బలగాలు సత్వరమే స్పందించడం మాత్రమే మన అధీనంలో ఉంటుంది.

### అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం-2026 ఇతివృత్తం :

2011లో ప్రపంచవ్యాప్తంగా జరిగిన 302 విపత్తుల్లో 80,000 మరణాలు, 206 మిలియన్ల ప్రజలు ప్రభావితం అయినారు. ఈ విపత్తులు మిగిల్చిన నష్టం 2 ట్రిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. సహజ (నాచురల్), మానవ కారణ (మ్యాన్ మేడ్) విపత్తులు జరిగినపుడు వెంటనే స్పందిస్తూ తీసుకోవలసిన చర్యలను, నష్ట నివారణ పద్దతులు, విపత్తు నిర్వహణ గూర్చి కనీస పరిజ్ఞానాన్ని అందించానే లక్ష్యంతో ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి నేతృత్వంలో ప్రపంచ దేశాల్లో 13 అక్టోబర్న "అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం" పాటించడం జరుగుతోంది. 1989 ఐరాస పిలుపు మేరకు విపత్తుల తీవ్రతను తగ్గించడం (మిటిగేషన్), నివారణించడం (ప్రివెన్షన్), స్పందించడం (రెస్పాన్స్), ధైర్యాన్ని నూరి పోయడం (రిఅష్యురెన్స్), తిరిగి యథాస్థితికి తీసుకురావడం (రికవరీ), ఎదుర్కొనే సంసిద్ధత కలిగి ఉండడం (ప్రిపరేషన్) లాంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని విపత్తు ప్రమాద నియంత్రణ మార్గాలను శోధించే వేదికగా అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దినాన్ని తీసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ విపత్తు ప్రమాద తగ్గింపు దినం-2026 నినాదంగా"స్థితప్రజ్ఞత ఇంటి నుంచే ప్రారంభం కావాలి (రెసిలియన్స్ స్టార్ట్స్ ఎట్ హోం)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు.

### విపత్తులు విధ్వంసకరం:

ప్రకృతి వైపరీత్యాల్లో భూకంపాలు, వరదలు, తుఫానులు, సునామీలు, సూక్ష్మ మహమ్మారి కల్లోలాలు, జునోటిక్ వ్యాధులు, వడగాలులు, మంచు తుఫానులు, ఇసుక తుఫానులు, అగ్నిపర్వత విస్ఫోటనాలు, అసాధారణ సముద్ర అలలు, నేల కోతలు, కరువులు, మంటలు, రేడియోధార్మిక వాయువుల వ్యాప్తి, హిమపాతాలు, కొండచరియలు విరిగి పడడం లాంటివి వస్తాయి. మానవ కారణ విపత్తుల్లో భోపాల్ వాయు దుర్ఘటన లాంటివి, సముద్రజలాల్లో పెట్రోలియం లీకేజ్, చెర్నోబిల్ అణు విస్ఫోటనం, భూతాపంతో మంచుకొండలు కరగటం లాంటివి వస్తాయి. వైపరీత్యాల తీవ్రత ఎక్కువగా ఉన్నపుడు ప్రాణ నష్టం వేలల్లో, గాయపడిన వారు లక్షల్లో, ఆస్థి నష్టం కోట్లల్లో ఉంటుంది.

### విపత్తు నిర్వహణ:

విపత్తు నిర్వహణలో ప్రజల ప్రాణాలను కాపాడడం ప్రధానమైంది. క్షతగాత్రులకు సత్వర వైద్య సదుపాయాల కల్పన, నిరాశ్రయులకు తాత్కాలిక శిబిరాల ఏర్పాటు, జంతువుల పరిరక్షణ, ఆస్థులను కాపాడుతూ నష్టాన్ని తగ్గించడం, అత్యవసర సరుకుల రవాణ వ్యవస్థలను నెలకొల్పడం లాంటి చర్యలను తీసుకోవాలి. శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంతో విపత్తులను ముందుగానే పసిగట్టగలిగితే నష్టాలను తగ్గించే అవకాశం చాలా ఉంటుంది. విపత్తు ప్రమాద నిర్వహణలో ఉద్యోగులకు, పట్టభద్రులకు కనీస శిక్షణ ఇవ్వడం తప్పకుండా చేయాలి. దీని కోసం దేశవ్యాప్తంగా ప్రభుత్వాలు విపత్తు నిర్వహణ శిక్షణ సంస్థలను నెలకొల్పాలి. విపత్తు ప్రమాద నిర్వహణలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర, జిల్లా, స్థానిక యంత్రాంగాలు, రాజకీయ పట్టుదల, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం, శాస్త్రసాంకేతిక సంస్థలు ఎల్లవేళల సిద్ధంగా ఉండాలి. విశ్వ మహమ్మారులైన సూక్ష్మజీవుల విజృంభన, వాతావరణ ప్రతికూలతలు, ప్రకృతి వైపరీత్యాలు, మానవ కారణ ప్రమాదాలు జరిగినపుడు సత్వర పౌర స్పందనతో అపార ప్రాణ ఆస్థి నష్టాన్ని తగ్గించవచ్చు. అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, సునామీల, భూకంపాలు లాంటి విపత్తులు జరిగినపుడు మానవ, జంతు ప్రాణనష్టం, ఆస్థి ధ్వంసం, ప్రకృతి వినాశనం పెద్ద ఎత్తున స్వల్ప వ్యవధిలోనే జరిగిపోతుంది.

### జాతీయ విపత్తు నియంత్రణ ప్రణాళిక:

విపత్తు ప్రమాద నివారణకు తీసుకోవలసిన చర్యల్లో విపత్తును తగ్గించే అవగాహన, ముందస్తు హెచ్చరికలు, విపత్తును ఎదుర్కొనే తయారీ ప్రణాళికలు, రికవరీ మరియు జీవనోపాధికి చేయూత లాంటి చర్యలతో విపత్తు ప్రమాదాలను తగ్గించవచ్చు. ఇండియాకు ఒక ప్రత్యేకమైన 'జాతీయ విపత్తు నియంత్రణ ప్రణాళిక' ఉండాలని, దానిని 2016లో రూపొందించిన ఘనత ప్రస్తుత కేంద్ర ప్రభుత్వానికే దక్కింది. దీనిలో భాగంగా ప్రత్యేకమైన 'జాతీయ విపత్తు స్పందన దళం (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్)' సహాయం తీసుకోవడం జరుగుతోంది. విపత్తు ప్రమాద అవగాహన, విపత్తు ప్రమాద నిర్వహణ, పర్యవేక్షణ యంత్రాంగం, విపత్తు నష్టాన్ని తగ్గించడానికి పెట్టుబడులు, విపత్తును ఏదుర్కొనేందుకు సిద్ధంగా ఉంటూ ముందస్తు హెచ్చరికలు చేయడం అనే నాలుగు సూత్రాల మీద భారత విపత్తు నిర్వహణ ప్రణాళికను అభివృద్ధి చేశారు.

ప్రకృతి వైపరీత్యాలు జరగకూడదని, జరిగినా ముందస్తు హెచ్చరికలతో తక్షణమే జరగబోయే అపార నష్టాన్ని తగ్గించగల విపత్తు నిర్వహణ యంత్రాంగంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా భాగస్వామ్యులు కావడానికి సంసిద్ధంగా ఉందాం. సహజ విపత్తుల పట్ల జాగ్రత్త ఉంటూనే మానవ తప్పిదాలతో జరుగనున్న విపత్తులను గమనించి తప్పిద్దాం.



-మధుపాలీ
9949700037

# అహ్మదాబాద్ లో బ్రిక్స్ సంప్రదాయ, స్వదేశీ క్రీడల ప్రదర్శన-2026

## ప్రారంభంపై ప్రకటన చేసిన కేంద్రమంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:బ్రిక్స్ భారత అధ్యక్షతన అక్టోబర్ 12, 2026న అహ్మదాబాద్‌లోని వీర్ సావర్కర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బ్రిక్స్ సంప్రదాయ, స్వదేశీ క్రీడల ప్రదర్శన-2026 జరుగుతుంది. గుజరాత్ ప్రభుత్వంతో కలిసి కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ దీన్ని నిర్వహిస్తుంది.

ఈ కార్యక్రమాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి డాక్టర్ మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభిస్తారు. ఈ ప్రారంభోత్సవ వేడుకకు గుజరాత్ ఉప ముఖ్యమంత్రి శ్రీ హర్ష్ సంఘ్వీ, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ సహాయమంత్రి శ్రీమతి రక్షా నిఖిల్ ఖడ్సే, గుజరాత్ క్రీడా శాఖ సహాయమంత్రి డాక్టర్ జైరామ్ గామిత్ ముఖ్య అతిథులుగా హాజరవుతారు.

ఈ క్రీడలు బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులను ఒకచోట చేర్చి, సంప్రదాయ, స్వదేశీ క్రీడా విధానాలను ప్రదర్శిస్తాయి. క్రీడల ద్వారా సాంస్కృతిక మార్పిడి, వారసత్వ పరిరక్షణ ప్రజల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందిస్తాయి.

పోటీతత్వం లేని వేదికగా రూపుదిద్దుకున్న ఈ క్రీడలు... సాంస్కృతిక ప్రాముఖ్యత, క్రీడాకారుల మధ్య పరస్పర సంబంధాలు, జ్ఞానాన్ని పంచుకునేందుకు ప్రాధాన్యతనిస్తాయి. సంప్రదాయ క్రీడా పద్ధతుల ప్రదర్శన, డాక్యుమెంటేషన్, అనుభవాల మార్పిడిపై దృష్టి సారిస్తాయి.

ఈ కార్యక్రమంలో పాల్గొనే దేశాలు వైవిధ్యమైన సంప్రదాయ, స్వదేశీ క్రీడలను, సాంస్కృతిక ఆచారాలను ప్రదర్శిస్తాయి:

బెలారస్: గోరోడ్కి బొలీవియా: లుచా డి చోలిటాస్, టింకు, రాయులా, ట్రోంపో, కాచినస్, కరెరా డి సాకోస్

బ్రెజిల్: జరాబటానా (స్వదేశీ బ్లోపైప్), కొరిడా డి టోరాస్ (లాగ్ రేస్), బ్రెజిలియన్ పారా-జియు-జిట్సు, కపోయిరా చైనా: వుషు, లయన్ డ్యాన్స్, హెల్త్ కిగాంగ్

ఇథియోపియా: ఇథియోపియన్ రెజ్లింగ్ (టెగెల్), ఇథియోపియన్ జెనా (ఫీల్డ్ హాకీ), సెలస్ గెబెటా/18-12/బుబే/షాహే

భారతదేశం: మల్లఖాంబ్, యోగాసనం, కలరిపయట్టు ఇరాన్: జోర్ఖానా, హఫ్త్ సాంగ్, ఘనీహ్ కజకిస్థాన్: అసిక్ అటూ, టోగిజ్కుమలక్, కజాక్ కురేసి రష్యా: గోరోడ్కి, సాంబో దక్షిణాఫ్రికా: కగాటి, ఇంటోంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్: అల్ తబ్బా

బ్రిక్స్ దేశాల మధ్య క్రీడా రంగంలో సహకారాన్ని పెంపొందించుకునేందుకు, సంప్రదాయ, స్వదేశీ క్రీడలను ప్రోత్సహించేందుకు విదేశీ ప్రతినిధి బృందాలతో ద్వైపాక్షిక సమావేశాలు జరుగుతాయి.

ఈ క్రీడల్లో పాల్గొనే దేశాల గొప్ప క్రీడా వారసత్వాన్ని వేడుకగా నిర్వహించటమే కాక, బ్రిక్స్ దేశాల మధ్య పరస్పర అవగాహనను, సాంస్కృతిక మార్పిడిని, ప్రజల మధ్య సంబంధాలను మరింత బలపరిచే వేదికగా ఇది నిలుస్తుంది.

# పెద్దూర్ చోరీ కేసును ఛేదించిన పోలీసులు

## నిందితుడి అరెస్ట్.. బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం



ఆదిలాబాద్, అక్టోబర్ 12: నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూర్ గ్రామంలో రెండు రోజుల క్రితం పూస గణేష్ ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖానాపూర్ సీఐ కట్కం సత్యనారాయణ తెలిపారు. ఆదివారం సాయంత్రం కడెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కడెం పీఎస్ ఎస్ఐ పి. సాయికిరణ్‌తో కలిసి సీఐ కేసు వివరాలను వెల్లడించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దూర్ గ్రామానికి చెందిన గుండబోయిన ముత్యాలు, అదే గ్రామానికి చెందిన పూస గణేష్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేని విషయాన్ని గమనించాడు. దీంతో గత గురువారం రాత్రి గణేష్ ఇంటి తాళాన్ని వాటర్ హీటర్‌తో కాల్చి ఇంట్లోకి చొరబడ్డాడు. అనంతరం బీరువాలో ఉన్న 36 గ్రాముల బంగారు ఆభరణాలు, 650 గ్రాముల వెండి ఆభరణాలను దొంగిలించాడు.

మరుసటి రోజు చోరీ చేసిన ఆభరణాలను విక్రయించేందుకు ఖానాపూర్‌లోని నగల దుకాణాలకు వెళ్తున్న సమయంలో పోలీసులు పక్కా ప్రణాళికతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు గతంలోనూ దొంగతనాలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి చోరీకి గురైన 36 గ్రాముల బంగారు ఆభరణాలు, 650 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సత్యనారాయణ వెల్లడించారు.

గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని నిఘా వ్యవస్థను బలోపేతం చేసేందుకు పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

ఈ కేసును ఛేదించడంలో ప్రత్యేక కృషి చేసిన హెడ్ కానిస్టేబుల్ జగ్మల్, కానిస్టేబుల్ భీమ్‌రావ్, ఇతర పోలీసు సిబ్బందిని సీఐ అభినందించి ప్రోత్సాహకాన్ని అందజేశారు.

# బాల్యమిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థుల అండ

## మిత్రుని కుమార్తె సంజన పేరిట రూ.40 వేల ఫిక్స్‌డ్ డిపాజిట్

ఆదిలాబాద్, అక్టోబర్ 12: బాల్య స్నేహానికి అండగా నిలుస్తూ, ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు.

దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన దుర్గం పోచయ్య (డిష్ పోషన్న) ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయింది. ఈ నేపథ్యంలో పోచయ్యతో కలిసి చదువుకున్న 2000?2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు స్పందించారు.

మిత్రుడి కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆయన కుమార్తె చిన్నారి సంజన పేరిట రూ.40 వేల మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు.సంజన చదువుకు, భవిష్యత్తుకు అవసరమైన సహాయాన్ని కూడా తమ వంతుగా అందిస్తామని హామీ ఇచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కష్టకాలంలో మిత్రుడి కుటుంబాన్ని ఆదుకున్న పూర్వ విద్యార్థుల సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అప్పాల మనోహర్‌తో పాటు 2000-2001 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# మై భారత్ - ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యువ సంవాద్ మేళాతో నషా ముక్త్

## యువ అభియాన్ మొదటి నెల పూర్తి లక్షా ఆరు వేలమందికి పైగా యువత భాగస్వామ్యం

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్, జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సంయుక్తంగా 20 26 అక్టోబర్ 9న దేశవ్యాప్తంగా 'యువ సంవాద్ మేళా'ను విజయవంతంగా నిర్వహించాయి. 'నా ఆరోగ్యం - నా గర్వం' ఇతి వృత్తంతో చేపట్టిన 100 వారాల సంకల్ప అభియాన్‌లో తొలి నెల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఎదేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 200 విద్యాసంస్థలు, వాటి పరిధిలోని దత్తత గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మొత్తం 1,06,855 మంది భాగస్వాములయ్యారు. మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణపై అవగాహన పెంపొందించడంతో పాటు, ఆరోగ్యకరమైన, వ్యసనరహిత సమాజ నిర్మాణాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో యువత, స్థానిక సమాజ సభ్యులను ఈ కార్యక్రమం ఒకచోట చేర్చింది.

దేశవ్యాప్తంగా 15 ఎన్ఎస్ఎస్ ప్రాంతీయ డైరెక్టరేట్ల పరిధిలో అమలు చేసిన నాలుగో వారం కార్యక్రమం లక్ష్యంగా నిర్దేశించుకున్న 200 విద్యాసంస్థల్లో 100 శాతం అమలును సాధించింది. ఈ కార్యక్రమంలో 93,662 మంది యువత పాల్గొనగా, గ్రామాలు, మురికివాడల్లో ప్రత్యేకంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమాల ద్వారా మరో 13,193 మంది పౌరులకు చేరువయ్యారు. సాధారణంగా నిర్వహించే ప్రతిజ్ఞా కార్యక్రమాలకు భిన్నంగా, 'యువ సంవాద్ మేళా'లో పరస్పర చర్చలు, ప్రజల్లో అవగాహన కల్పించడం, సాంస్కృతిక ప్రదర్శనలకు ప్రాధాన్యమిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై ప్రజలు అవగాహనతో కూడిన చర్చలు జరిపేలా ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. అవి యువతతో ముఖాముఖి చర్చలు, అవగాహన స్టాళ్లు, సాంస్కృతిక ప్రదర్శనలు. యువ సంవాద్ (సంభాషణ) కార్యక్రమంలో భాగంగా 509 పరస్పర చర్చా సదస్సులు, బహిరంగ చర్చా వేదికలను నిర్వహించారు. వీటిలో 36,086 మంది యువత పాల్గొని మాదకద్రవ్యాల దుర్వినియోగానికి దారితీసే మూలకారణాలు, తోటి వారి ఒత్తిడి, సమాజ భాగస్వామ్యంతో చేపట్టాల్సిన నివారణ చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, స్థానిక నాయకులు కూడా పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో భాగంగా, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు 396 సమాచార స్టాళ్లు, కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. వ్యసనాల వల్ల కలిగే శారీరక, మానసిక దుష్ప్రభావాలపై సమాచారం అందించడంతో పాటు, అందుబాటులో ఉన్న కౌన్సెలింగ్ సేవల గురించి పాల్గొన్నవారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో 32,909 మంది పాల్గొన్నారు. వీటికి తోడు వీధి నాటకాలు, లఘు నాటికలు, సంగీత ప్రదర్శనలు సహా 587 సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వీటి ద్వారా 24,944 మందికి సందేశాన్ని చేరవేశారు. సృజనాత్మకతకు, స్థానిక పరిస్థితులకు అనుగుణమైన కళారూపాలకు ప్రాధాన్యమిస్తూ, వ్యసనరహిత భారతదేశ నిర్మాణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

ఈ ప్రచార కార్యక్రమంలో అన్ని వర్గాలకు చెందిన యువత క్రియాశీల భాగస్వామ్యం కనిపించింది. గణాంకాల ప్రకారం మొత్తం 48,269 మంది యువతులు, 45,618 మంది యువకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో యువతుల చురుకైన భాగస్వామ్యాన్ని ఈ గణాంకాలు ప్రతిబింబిస్తున్నాయి. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, యువత తమ భాగస్వామ్యం ద్వారా ఆరోగ్యం, శ్రేయస్సు, సమష్టి బాధ్యతకు సంబంధించిన సందేశాన్ని విద్యా సంస్థలతో పాటు వాటి పరిసర ప్రాంతాల్లోని సమాజాలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించారు.

క్షేత్రస్థాయిలో చేపట్టిన ప్రజా భాగస్వామ్య కార్యక్రమాలకు డిజిటల్ వేదికల ద్వారా మరింత ప్రచారం లభించింది. యువ అంబాసిడర్లు చనషాముక్తయువ హ్యాష్‌ట్యాగ్‌తో 935 సోషల్ మీడియా పోస్టులను రూపొందించి, ప్రచారం నిర్వహించారు. ఈ డిజిటల్ ప్రచారం ద్వారా స్థానికంగా నిర్వహించిన కార్యక్రమాలకు మరింత విస్తృత గుర్తింపు లభించడంతో పాటు, పెద్ద సంఖ్యలో ప్రజల వద్దకు ఈ అభియాన్ సందేశాన్ని చేరవేసేందుకు దోహదపడింది.

100 వారాల సంకల్ప అభియాన్‌లో తొలి నెల విజయవంతంగా ముగియడంతో తదుపరి దశ కార్యక్రమాలకు ప్రాతిపదిక ఏర్పడింది. రెండో నెలలో 'ఆరోగ్యవంతమైన యువత - వ్యసనరహిత యువత' ఇతివృత్తంతో శారీరక దృఢత్వం, క్రీడలపై దృష్టి సారించనున్నారు.'యువత ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడంతో పాటు, మాదకద్రవ్యాల దుర్వినియోగ నివారణలో శారీరక వ్యాయామం, చురుకైన జీవనశైలి కీలక పాత్ర పోషిస్తాయని గుర్తించేలా ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మై భారత్, ఎన్ఎస్ఎస్, విద్యాసంస్థలు, స్థానిక సమాజాల నిరంతర భాగస్వామ్యంతో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ యువత ఆధ్వర్యంలోని అవగాహన కార్యక్రమాలు, సమాజ భాగస్వామ్యం, సమష్టి కార్యాచరణను మరింత బలోపేతం చేస్తోంది. ఆరోగ్యవంతమైన, సాధికారత కలిగిన, వ్యసనరహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా ఈ ప్రయత్నాలను కొనసాగిస్తోంది.

# శైలపుత్రి అలంకారంలో జ్ఞాన సరస్వతి దర్శనం

## బాసరలో వైభవంగా శారదీయ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



ఆదిలాబాద్, అక్టోబర్ 12: చదువుల తల్లి కొలువైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో శారదీయ నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల తొలిరోజు అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనవిచ్చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్సవాల్లో భాగంగా బాలాలయంలో ఘటస్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్, ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి, వేద పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య కలశ పూజ, గణపతి పూజ, క్షేత్ర తీర్థ పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్, సర్పంచ్ వెంకటేశ్ గౌడ్, ఆలయ ఈవో అంజనాదేవి, ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శరత్ పాటక్ తదితరులు పాల్గొన్నారు.

శారదీయ నవరాత్రుల మొదటి రోజు సంప్రదాయం ప్రకారం జ్ఞాన సరస్వతి అమ్మవారు శైలపుత్రి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వృషభ వాహనంపై ఆసీనురాలైన ఈ దేవి కుడిచేతిలో త్రిశూలం, ఎడమచేతిలో కమలాన్ని ధరించి, శిరస్సుపై చంద్రవంకతో విరాజిల్లుతారు. శైలపుత్రి దేవిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే మనోవాంఛలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం.

ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి కట్టె పొంగలిని నైవేద్యంగా సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభంతో బాసర ఆలయంలో భక్తి సందడి నెలకొంది.

# ఎనిమిది రాష్ట్రాల్లో పురోగతిపై సమీక్ష జిల్లా వారీగా, నిర్దిష్ట గడువులతో కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచన

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12: కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం-2006 (షెడ్యూల్డ్ తెగలు, ఇతర సంప్రదాయ అటవీ నివాసుల అటవీ హక్కుల గుర్తింపు చట్టం) అమలుపై రెండో ప్రాంతీయ సమీక్షా సమావేశం 2026 అక్టోబర్ 9న పశ్చిమ బెంగాల్ లోని కోల్‌కతాలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఎనిమిది రాష్ట్రాలకు చెందిన గిరిజన సంక్షేమ, రెవెన్యూ, అటవీ శాఖల ఉన్నతాధికారులు, గిరిజన పరిశోధనా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆ రాష్ట్రాలు పశ్చిమ బెంగాల్, అస్సాం, త్రిపుర, జార్ఖండ్, ఒడిశా, బీహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్. అటవీ హక్కుల పట్టాల డిజిటలైజేషన్, వాటిని ప్రభుత్వ రికార్డుల్లో చేర్చడం, అటవీ హక్కుల పట్టాదారులకు జీవనోపాధి పథకాలను అనుసంధానించడం, హక్కుదారులకు రుణ సదుపాయాలు కల్పించడం వంటి అంశాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చేపట్టిన ఉత్తమ విధానాలను వివరించేందుకు ఆ రాష్ట్ర ఉన్నతాధికారులను కూడా ఆహ్వానించారు. అటవీ హక్కుల దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న జిల్లాలకు చెందిన జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఐటీడీపీ/ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. చట్టం అమలు ప్రస్తుత స్థితిని సమీక్షించడంతో పాటు, వివిధ శాఖల సమన్వయంతో ముందుకు సాగేందుకు చేపట్టాల్సిన చర్యలపై వారు చర్చించారు. దక్షిణాది రాష్ట్రాల కోసం 2026 సెప్టెంబర్ 10న బెంగళూరులో నిర్వహించిన మొదటి ప్రాంతీయ సమీక్షా సమావేశానికి కొనసాగింపుగా ఈ రెండో సమావేశాన్ని నిర్వహించారు.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ గిరిజన అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి స్వాగత ప్రసంగంతో సమావేశ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సమావేశం లక్ష్యాలను ఆయన వివరించి, హాజరైన ప్రముఖులు, ప్రతినిధులకు అధికారికంగా స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి కీలకోపన్యాసం, ఆ శాఖ కార్యదర్శి ప్రత్యేకోపన్యాసం చేశారు.

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి మాట్లాడుతూ.. 2026 ఆగస్టు 31 నాటికి దేశవ్యాప్తంగా 54 లక్షలకు పైగా అటవీ హక్కుల దరఖాస్తులు అందాయని, వాటిలో సుమారు 25 లక్షల హక్కుల పట్టాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా సుమారు 11 లక్షల దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని, 18 లక్షలకు పైగా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా, అస్సాం రాష్ట్రాల్లోని కొన్ని నిర్దిష్ట జిల్లాల్లో దరఖాస్తుల పెండింగ్ ఎక్కువగా ఉందని ఆయన తెలిపారు. ఈ ప్రాంతీయ సమావేశంలో చట్టం, నిబంధనలకు అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం.. చట్టం, నిబంధనలకు అనుగుణంగా తిరస్కరించిన దరఖాస్తులను సమీక్షించడం.. అటవీ హక్కుల చట్టానికి సంబంధించిన సమాచారాన్ని సమన్వయం చేసి, సరిచూసుకోవడం.. ఎఫ్ఆర్ఏ కేసు రికార్డులను డిజిటలైజేషన్ చేయడం.. గుర్తించిన హక్కులను రెవెన్యూ, అటవీ శాఖల రికార్డుల్లో నమోదు చేయడం.. సామూహిక అటవీ వనరుల హక్కుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయడం.. పీవీటీజీ ఆవాస హక్కులను గుర్తించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆయన వివరించారు.

అవగాహన కల్పించడం, హక్కుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తదుపరి దశలో అవసరమైన సహాయం అందించడం, సామాజిక అటవీ వనరుల నిర్వహణ ప్రణాళికలను రూపొందించడం వంటి అంశాలపై గ్రామసభల సామర్థ్యాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రాలు ప్రాధాన్యతతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని గిరిజన పరిశోధన సంస్థలు, సమాచార సాంకేతిక విభాగం (టీఆర్ఐ, ఐటీ) ఉప కార్యదర్శి అటవీ హక్కుల రికార్డుల డిజిటలైజేషన్‌పై ప్రసంగించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి అటవీ హక్కుల వేదిక, అటవీ హక్కుల మొబైల్ యాప్ పనితీరును ప్రదర్శించారు. అటవీ హక్కుల పరిపాలనలో డిజిటలైజేషన్, భౌగోళిక సమాచార అనుసంధానం, నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడే వ్యవస్థల అభివృద్ధికి ఇవి దోహదపడతాయని వివరించారు. రాష్ట్రాలు తమ వద్ద ఇప్పటికే ఉన్న అటవీ హక్కుల రికార్డులను అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ (ఏపీఐ) [illegible] అనుసంధానించుకోవాలని ఆయన కోరారు.

ఎనిమిది రాష్ట్రాలకు చెందిన అధికారులు తమ తమ రాష్ట్రాల్లో అటవీ హక్కుల చట్టం (ఎఫ్ఆర్ఏ) అమలు తీరును వివరించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, హక్కుల వివరాలను ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేయడం, సామూహిక అటవీ వనరుల హక్కులు (సీఎఫ్ఆర్ఆర్), ప్రత్యేకంగా బలహీన గిరిజన సమూహాల (పీవీటీజీలు) ఆవాస హక్కుల గుర్తింపు, అటవీ హక్కుల రికార్డుల డిజిటలైజేషన్ వంటి అంశాలపై వివరాలను సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం, తిరస్కరించిన దరఖాస్తులను పునఃసమీక్షించడం, సామాజిక అటవీ వనరుల హక్కులు, ఆవాస హక్కులను నిర్దిష్ట గడువులోగా గుర్తించడం వంటి అంశాలపై రాష్ట్రాలు తమ కార్యాచరణ ప్రణాళికలను వివరించాయి. అర్హులైన హక్కుదారులకు జీవనోపాధి, అభివృద్ధి పథకాల ద్వారా సహాయం అందేలా వివిధ ప్రభుత్వ పథకాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపైనా ప్రణాళికలను సమర్పించాయి.

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ముగింపు ప్రసంగంతో సమావేశం ముగిసింది. అనంతరం అటవీ హక్కుల చట్టం విభాగం డైరెక్టర్ కృతజ్ఞతలు తెలిపారు.

# ఈ నెల 14న గోదావరిఖనిలో భారీ బహిరంగ సభ

**ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**సింగరేణి సంపద, కార్మికుల సమస్యలే ప్రధాన అజెండా**

**కార్మికులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపు**

కరీంనగర్, అక్టోబర్ 12: సింగరేణి సంస్థ సంపద, కార్మికుల సంక్షేమం, ప్రభుత్వ విధానాలపై రాజకీయ పోరాటానికి బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంపదను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతోందని, కార్మికుల ప్రయోజనాలను విస్మరిస్తోందని ఆరోపిస్తూ ఈ నెల 14న గోదావరిఖనిలో 'సింగరేణి కార్మిక గర్జన' పేరుతో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు ప్రకటించారు. ఈ సభకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

సింగరేణి కార్మికుల హక్కులు, సంస్థ ఆర్థిక ప్రయోజనాలు, కార్మికుల సంక్షేమానికి సంబంధించిన అంశాలను సభలో ప్రస్తావించనున్నట్లు బీఆర్ఎస్ నాయకులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల సింగరేణికి, అక్కడ పనిచేస్తున్న కార్మికులకు నష్టం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. ఈ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ కార్మికుల తరఫున పోరాటం కొనసాగిస్తామని పేర్కొంటున్నారు.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభకు హాజరై సింగరేణి కార్మికుల సమస్యలపై మాట్లాడనున్నారు. సంస్థ సంపద పరిరక్షణ, కార్మికుల ప్రయోజనాలు, ప్రభుత్వ నిర్ణయాలపై పార్టీ వైఖరిని వెల్లడించనున్నట్లు నాయకులు తెలిపారు. సభ ద్వారా కార్మికుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, తమ ఆందోళనను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడమే లక్ష్యంగా బీఆర్ఎస్ భావిస్తోంది.

'సింగరేణి సంపదను అడ్డగోలుగా దోచుకుంటూ కార్మికుల జీవితాలను నాశనం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తేందుకే ఈ సభను నిర్వహిస్తున్నాం' అని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పేర్కొన్నారు. సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో గోదావరిఖనికి తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

సింగరేణి ప్రాంతంలో కార్మికుల సమస్యలు, సంస్థ భవిష్యత్తు, ప్రభుత్వ విధానాలు రాజకీయంగా కీలక అంశాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ నిర్వహించనున్న 'సింగరేణి కార్మిక గర్జన' సభకు ప్రాధాన్యం ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, కార్మికుల సంక్షేమంపై చర్చ ఈ సభలో ప్రధానంగా నిలిచే అవకాశముంది.


జయంతి తే సుకృతినో రససిద్ధాః

తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలలో 26 ఏళ్లుగా విశిష్ట సేవలు అందిస్తున్న

జయంతి పబ్లికేషన్స్ హైదరాబాద్

పుస్తక ప్రచురణ • సాహిత్య కార్యక్రమాల నిర్వహణ

తెలుగు సాహితీసేవలో రెండున్నర దశాబ్దాల వరంపర

జయంతి పబ్లికేషన్స్ హైదరాబాద్ JAYANTHI PUBLICATIONS-HYDERABAD

తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలలో మా 'జయంతి పబ్లికేషన్స్' గత కొన్ని దశాబ్దాలుగా 'పుస్తక ప్రచురణ-సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ'లో విశేషమైన సేవలు అందిస్తూ... కొనసాగుతున్నది. తెలుగులోని వర్తమాన రచయితలు మొదలుకొని లబ్ధప్రతిష్ఠులైన సాహితీవేత్తల రచనలు 500లకి పైగా ప్రచురించి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కవులు, రచయితలు, కళాకారులను ఒకే వేదిక పైకి తెచ్చి, తెలుగుభాష వికాసానికి అనేక నూతన, రికార్డు స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన ఘనచరిత్ర 'జయంతి పబ్లికేషన్స్' సంస్థకు ఉంది.

500+ పుస్తక ప్రచురణలు

గతంలో 'జయంతి పబ్లికేషన్స్' నిర్వహించిన ప్రముఖ సభల వివరాలు

హైదరాబాద్ (2003, 2004) — 'సాహితీ సప్తాహమ్' పేరిట 'సిటీ సెంట్రల్ లైబ్రరీ', చిక్కడపల్లిలో 4 - 10 ఆగస్టు 2003&2004 తేదీలలో వరుసగా 7 రోజుల పాటు ప్రతిరోజూ సాయంత్రం 'పుస్తకావిష్కరణ' కార్యక్రమాలు.

హైదరాబాద్ (2005) — 'పుస్తకాభిషేకమ్ - 9 టు 9' పేరిట 'పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం', పబ్లిక్ గార్డెన్స్‌లోని 'ఎన్టీఆర్ కళామందిరం'లో 17 జూలై 2005 తేదీన ఉదయం 9 గం॥ల నుంచి రాత్రి 9 గం॥ల వరకు గంటకొక పుస్తకం చొప్పున ఒకే రోజు 12 పుస్తకాల ఆవిష్కరణ, 12 గం॥ల నిరంతర సాహిత్య వినోద కార్యక్రమాలు.

విశాఖపట్నం (2005) — 'కవితాపుష్పకమ్ - 9 టు 9' పేరిట 'జిల్లా పరిషత్ సమావేశ మందిరం', కలెక్టరేట్ జంక్షన్‌లో 11 డిసెంబర్ 2005 తేదీన ఉదయం 9 గం॥ల నుంచి రాత్రి 9 గం॥ల వరకు 320 మంది సీనియర్, వర్ధమాన కవులతో ఒకేరోజు 12 గం॥ల నిర్విరామ కవిసమ్మేళనం, 'కవితామాలిక-2005' పుస్తకావిష్కరణ.

విజయవాడ (2006) — 'సాహితీ పట్టాభిషేకమ్ - 9 టు 9' పేరిట 'మహాకవి శ్రీశ్రీ సభామందిరం', ప్రజాశక్తి బిల్డింగ్, గవర్నర్ పేటలో 6 ఆగస్టు 2006 తేదీన ఉదయం 9 గం॥ల నుంచి రాత్రి 9 గం॥ల వరకు ఒకే రోజు 12 గం॥ల పాటు 'నిరంతర పుస్తకావిష్కరణ-నిర్విరామ కవిసమ్మేళన'ల సాహిత్యోత్సవం.

నెల్లూరు (2007) — 'సింహపురి సాహితీ సమ్మేళనమ్ - 2007' పేరిట 'టౌన్ హాల్' (రేబాల లక్ష్మీనరసారెడ్డి పురమందిరం)లో 4 ఫిబ్రవరి 2007 తేదీన ఉదయం 9 గం॥ల నుంచి రాత్రి 9 గం॥ల వరకు ఒకే రోజు 12 గం॥ల పాటు 400 మంది పైచిలుకు కవులు, రచయితలతో 'నిర్విరామ కవిసమ్మేళనలు.'

గుంటూరు (2009) — 'కవితా మహోత్సవమ్ - 9 టు 9' పేరిట 'మెడికల్ క్లబ్ హాలు' కలెక్టర్ బంగళా రోడ్, టొబాకో బోర్డ్ దగ్గర 12 ఏప్రిల్ 2009 తేదీన ఉదయం 9 గం॥ల నుంచి రాత్రి 9 గం॥ల వరకు ఒకే రోజు 12 గం॥ల పాటు 500 మంది పైచిలుకు కవులతో నిరంతర కవిసమ్మేళనం, 'కవితామాలిక-2008' పుస్తకావిష్కరణ.

ఈ నేపథ్యంలో... సుదీర్ఘమైన 26 ఏళ్ల సాహిత్యప్రస్థానం తర్వాత-తెలుగు సాహితీప్రపంచంలో 'జయంతి పబ్లికేషన్స్' మరో అరుదైన చారిత్రాత్మక ఘట్టానికి శ్రీకారం చుడుతూ... హైదరాబాద్ నగరంలో

సాహితీ సప్తకమ్

7 రోజుల బృహత్తర సాహిత్యోత్సవం

26 అక్టోబర్ 2026 నుండి 01 నవంబర్ 2026 వరకు... వరుసగా 7 రోజుల పాటు

పుస్తకావిష్కరణలు | కవి సమ్మేళనాలు | బహుమతులు, పురస్కారాల ప్రదానాలు | సన్మానాలు సత్కారాలు | సాంస్కృతిక కార్యక్రమాలు

జయంతి పబ్లికేషన్స్ - హైదరాబాద్ ✆ 9989114302 & 7075815111

సాహిత్య సేవలో... సృజనాత్మకత వేదికగా... మరిన్ని విషయాలతో మా తదుపరి ప్రకటన... త్వరలో!


# క్రీడలతో ఉజ్వల భవిష్యత్

**జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**

కరీంనగర్, అక్టోబర్ 12: జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లాస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఖేలో ఇండియా సెంటర్‌కు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను ఆదివారం జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అభినందించారు.

చదువుతో పాటు క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలను పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కష్టపడి సాధన చేసి రాష్ట్రస్థాయిలోనూ పతకాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్న కోచ్ నల్ల నవీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. జగిత్యాలలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. అండర్-14: సీహెచ్. గుణతేజ, వి. మిధున్, అసిత్, ఇస్మాయిల్, అండర్-17: ఎల్. కార్తికేయ, హృదయ్, సీహెచ్. శ్రీవైష్ణవి, కే. వాసవి, ఎస్. స్వరాలి. కార్యక్రమంలో సీనియర్ పలువురు ప్రజాప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

# కొలాం గిరిజనులకు న్యాయం చేయాలి

**ఇళ్ల నిర్మాణాలకు అనుమతులివ్వాలి..**

**అటవీ అధికారుల అడ్డంకులు తొలగించాలి**



ఆదిలాబాద్, అక్టోబర్ 12: ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని కొలాం గిరిజనులకు న్యాయం చేయాలని, మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులకు వినతిపత్రం అందజేశారు.

భారతీయ జనతా పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో ఎస్టీ కమిషన్ సభ్యుడు బానోత్ హుస్సేన్ నాయక్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన కొలాం ఆదివాసీ గూడాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రంలో వివరించినట్లు పేర్కొన్నారు.

కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని గ్రామాల్లో ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ (పీఎం-జన్మన్), ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇప్పించాలని, అటవీ అధికారుల నుంచి ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని కోరినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ సానుకూలంగా స్పందించినట్లు రితీష్ రాథోడ్ వెల్లడించారు. అటవీ అధికారులతో మాట్లాడి గిరిజనులకు తగిన న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు సిడం బాపూరావు, టేకం భీంరావు, కొడప లేటు, ఆత్రం తుకారాంతో పాటు పలువురు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా ఏర్పాటులో ఘన్‌పూర్ త్యాగం మరువలేనిది!

**జిల్లాల విభజన పేరుతో ప్రజల ఆకాంక్షలను దెబ్బతీయొద్దు**



కరీంనగర్, అక్టోబర్ 12: తెలంగాణలో చిన్న జిల్లాల ఏర్పాటుతో పరిపాలనను ప్రజలకు చేరువ చేసి, అభివృద్ధికి బాటలు వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రాజయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జనగామ నూతన కలెక్టరేట్ వద్ద కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనేందుకు వందలాది మంది బైక్ ర్యాలీగా తరలి వెళ్లారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ.. జనగామ జిల్లా ఏర్పాటులో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఐదు మండలాల ఉద్యమకారులు, బీఆర్ఎస్ కార్యకర్తల త్యాగాలు, పోరాటాలు కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2016లో కేసీఆర్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, గ్రామ పంచాయతీల సంఖ్యను పెంచిందని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతానికి పది జిల్లాలు ఉండగా, కేసీఆర్ హయాంలో 33 జిల్లాలుగా పునర్వ్యవస్థీకరించారని తెలిపారు.

చిన్న జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు చేరువయ్యాయని, అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండేలా పరిపాలనా వ్యవస్థ బలోపేతమైందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలోనే జనగామను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలనే అంశాన్ని తాము బలంగా ముందుకు తీసుకెళ్లామని గుర్తుచేశారు.

జనగామ జిల్లా ఏర్పాటుతో పాటు ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్ అభివృద్ధికి కూడా ప్రాధాన్యం లభించిందని రాజయ్య తెలిపారు. రెండు కొత్త మండలాలు, 34 కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్‌ను ఒప్పించి స్టేషన్ ఘన్‌పూర్‌కు డిగ్రీ కళాశాలను సాధించుకున్నామని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధితో సుమారు 67 కిలోమీటర్ల మేర రహదారి సదుపాయాలు మెరుగుపడ్డాయని వివరించారు. తొమ్మిది రిజర్వాయర్ల ద్వారా సాగునీరు అందిస్తూ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ప్రతి జిల్లాలో కలెక్టరేట్లు, వైద్య కళాశాలల ఏర్పాటు సహా అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు బీఆర్ఎస్ హయాంలో అమలయ్యాయని పేర్కొన్నారు.

కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జిల్లాల ప్రాధాన్యాన్ని తగ్గించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని రాజయ్య విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యవహరించిన వారే నేడు కాంగ్రెస్‌లో చేరి జిల్లాల అంశంపై మాట్లాడుతున్నారని ఆరోపించారు. జిల్లాల విభజన పేరుతో ప్రజల ఆకాంక్షలను దెబ్బతీయవద్దని, జనగామ జిల్లా అభివృద్ధితో పాటు ప్రజల ప్రయోజనాలను కాపాడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, పట్టణ అధ్యక్షుడు కనకం గణేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చల్లా చందర్‌రెడ్డి, కౌన్సిలర్ చల్లా రమ్య రఘురెడ్డి, సీనియర్ నాయకుడు నర్సింహారెడ్డి, నాయకులు మారపల్లి ప్రసాద్‌బాబు, గాదె రాజు, శీలం శ్యామ్, గుండె మల్లేష్, ఒగ్గు రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ పోరాటం

**కేసీఆర్ హయాంలో గ్లోబల్ సంస్థగా మార్చే ప్రయత్నం..**

కరీంనగర్, అక్టోబర్ 12: మన ప్రాంతాన్ని, మన సంస్థను కాపాడుకోవాలన్నదే బీఆర్ఎస్ ఆలోచనని, అందుకోసమే పోరాటం చేస్తున్నామని మాజీ ఎంపీ, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహాలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కలిసి సింగరేణి సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని బాల్క సుమన్ ఆరోపించారు. తెరవెనుక చర్చలు జరుపుతూ సంస్థలో రాష్ట్ర ప్రభుత్వ వాటాలో 10 నుంచి 15 శాతం అమ్మాలనే ఆలోచన చేస్తున్నారని విమర్శించారు. రెండేళ్ల కాలంలోనే సింగరేణి సంస్థను నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

గతంలో కేసీఆర్ సింగరేణి సంస్థను మరింత విస్తరించాలనే ఆలోచనతో సీఎండీని అనేక దేశాలకు పంపించారని బాల్క సుమన్ గుర్తుచేశారు. దేశంలోని ఇతర రాష్ట్రాలకు సంస్థను విస్తరించడంతోపాటు, అంతర్జాతీయ స్థాయి సంస్థగా తీర్చిదిద్దాలని ప్రయత్నించారని తెలిపారు. అలాంటిది నేడు కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణిని జేబు సంస్థగా మార్చుకుందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రితోపాటు మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, వివేక్‌లకు వాటా ఉందని, అందుకే వారు మాట్లాడటం లేదని విమర్శించారు. ఈ ప్రాంత ఓట్లతో గెలిచిన వారు సింగరేణి అంశంపై ఎందుకు స్పందించడం లేదో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.

సింగరేణి కార్మికుల ప్రయోజనాలను కాపాడటం కోసమే బీఆర్ఎస్ పోరాటం చేస్తోందని బాల్క సుమన్ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 14న రామగుండంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి కార్మికులకు మేలు చేయడమే లక్ష్యమన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయలేదని, వైద్య పరీక్షల కోసం వెళ్లిన వారిని వెనక్కి పంపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవో 76 కింద 30 వేల కుటుంబాలకు స్థలాలు ఇచ్చామని గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ఈ జీవో ద్వారా ఒక్కరికీ పట్టా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

# సామాజిక బాధ్యతలో సింగరేణి!

**ప్రభావిత ప్రాంతాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు**

**ఆర్జీ-1 శిక్షణ కేంద్రం నుంచి 112 మందికి ఉపాధి..**

**ఫాక్స్‌కాన్‌లో 87 మంది మహిళలకు అవకాశం**

కరీంనగర్, అక్టోబర్ 12:: సింగరేణి ప్రభావిత ప్రాంతాల్లో నైపుణ్యం కలిగిన నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయంలో తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాయి. యువతకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో సింగరేణి సంస్థ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా దశలవారీగా ఉద్యోగ మేళాలు నిర్వహిస్తూ, అభ్యర్థుల నైపుణ్యాలు, అర్హతలను బట్టి ప్రముఖ కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి, శిక్షణ అనంతరం ఉపాధి కల్పించడంపై దృష్టి సారించింది. రామగుండం-1 ఏరియా లోని సింగరేణి జీవీటీసీ నైపుణ్యా భివృద్ధి కేంద్రం ద్వారా తాజాగా 154 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో 127 మంది మహిళా అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 87 మంది హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

మరోవైపు 27 మంది పురుష అభ్యర్థులు సోలార్ టెక్నీషియన్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 25 మంది ఎంపికయ్యారు. వీరు పది రోజుల్లో ఎల్ అండ్ ఎన్ కంపెనీలో ఉద్యోగాల్లో చేరనున్నట్లు ఆర్జీ-1 జీఎం డి. లలిత్‌కుమార్ తెలిపారు. ఫాక్స్‌కాన్‌కు ఎంపికైన మహిళల్లో తొలి విడతగా 55 మంది ఆదివారం గోదావరిఖని నుంచి హైదరాబాద్‌కు బయలుదేరారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్య శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశాలను అందిస్తోంది. గత రెండేళ్లలో 500 మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించింది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో శిక్షణ అందిస్తూ, యువతకు ఉద్యోగాలు లభించేలా చర్యలు తీసుకుంటోంది.

ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గత వారం జీవీటీసీ నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో మహిళా అభ్యర్థులకు ప్రత్యేక ఉద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని కంపెనీ తయారీ కేంద్రంలో ఆపిల్ ఇయర్‌పాడ్స్, ఎలక్ట్రానిక్ విడిభాగాల అసెంబ్లింగ్ విభాగాల్లో పనిచేసేందుకు 87 మంది మహిళలను ఎంపిక చేశారు. స్థానిక మహిళలకు పారిశ్రామిక రంగంలో లభించిన ఈ అవకాశాలు వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడనున్నాయి. సింగరేణి ప్రభావిత ప్రాంతాల యువతకు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు సంస్థ కృషి చేస్తోందని ఆర్జీ?1 జీఎం డి. లలిత్‌కుమార్ అన్నారు. శిక్షణను ఉద్యోగ అవకాశాలతో అనుసంధానించడం ద్వారా యువత మెరుగైన భవిష్యత్తును నిర్మించుకునే అవకాశం లభిస్తోందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రమశిక్షణతో పనిచేస్తూ వృత్తిలో ఎదగాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎస్.కె. చంద్రశేఖర్, ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, టాస్క్ మేనేజర్ డాక్టర్ కౌసల్య, ఎల్ అండ్ ఎన్ డైరెక్టర్ కౌశల్, ఫాక్స్‌కాన్ హెచ్ఆర్ ప్రతినిధి ఆర్. శ్రీనివాస్, జీవీటీసీ మేనేజర్ మాధవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎనిమిదేళ్ల లక్ష్యమైన 2,000 కిలోమీటర్లలో... 1,000 కిలోమీటర్ల
# క్వాంటం-సురక్షిత సమాచార వ్యవస్థను సాధించిన భారత్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12:జాతీయ లక్ష్యాలను 2047 నాటికల్లా సాధించి, దేశ వ్యూహాత్మక స్వయం-సమృద్ధిని పటిష్ఠం చేయడం కోసం భారతీయ పరిశ్రమలు ముందుకు రావాలని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, ఎర్త్ సైన్సెస్ శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), ప్రధాన మంత్రి కార్యాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పిలుపునిచ్చారు. దేశంలో సరికొత్త ఆవిష్కరణలను వేగవంతం చేస్తూ, శాస్త్రీయ పరిశోధనలను లాభదాయక వ్యాపారాలుగా మార్చాలని, భారత సాంకేతిక సామర్థ్యాలను భారీగా పెంచాలని ఆయన స్పష్టం చేశారు.

న్యూఢిల్లీలో జరిగిన పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (పీహెచ్‌డీసీసీఐ) 121వ వార్షిక సదస్సునుద్దేశించి కేంద్ర మంత్రి ప్రసంగించారు. భారత శాస్త్రీయ నైపుణ్యాలను స్వదేశీ సాంకేతికతలుగా, లాభదాయకమైన వ్యాపారాలుగా, ప్రపంచస్థాయి సవాళ్లను ఎదుర్కొనే పరిష్కారాలుగా మార్చడం కోసం... ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా కేంద్రాలు, అంకురసంస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరముందని ఆయన స్పష్టం చేశారు. భారత వృద్ధి, ఆవిష్కరణల ప్రాధాన్యతలపై చర్చించేందుకు పరిశ్రమ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు, ఇతర వాటాదారులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తీసుకువచ్చింది.

భారత సాంకేతిక వృద్ధి తదుపరి దశ కేవలం ఇతర దేశాలు అభివృద్ధి చేసిన సాంకేతికతలను అనుకరించడం లేదా వాడుకోవడంతో ముగిసిపోకూడదనీ... ప్రపంచానికి ఉపయోగపడేలా మన సొంత పరిష్కారాలను సృష్టించే దిశగా ముందుకు సాగాలని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. పాలసీ సంస్కరణల తర్వాత అంతరిక్ష రంగం విస్తరణ, వ్యూహాత్మక సాంకేతిక రంగాల్లో ప్రైవేట్ భాగస్వామ్యం పెరగడం దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. శాస్త్రీయ సామర్థ్యాలకు ప్రభుత్వ అనుకూల విధానాలు, పారిశ్రామికవేత్తల చొరవ తోడైనప్పుడు అద్భుతమైన అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఈ మార్పు నిరూపిస్తోందని కేంద్ర మంత్రి వివరించారు.

జాతీయ క్వాంటం మిషన్ కింద సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ... 2,000 కిలోమీటర్ల క్వాంటం-సురక్షిత కమ్యూనికేషన్‌ను సాధించాలనే ఎనిమిదేళ్ల లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకుందని, మూడేళ్లలోనే 1,000 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుందని కేంద్ర మంత్రి తెలిపారు. క్వాంటం కమ్యూనికేషన్ వ్యూహాత్మక, భద్రతా ప్రాముఖ్యతను... అత్యాధునిక సాంకేతికతల్లో దేశీయ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన ఆవశ్యకతను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు.

2014లో సుమారు 10 బిలియన్ డాలర్లుగా ఉన్న భారత బయోఎకానమీ విలువ... ప్రస్తుతం 196 బిలియన్ డాలర్లకు వృద్ధి చెందిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. 2030 నాటికి 300 బిలియన్ డాలర్లకు చేరుకోవాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు ఆయన తెలిపారు. బయోటెక్నాలజీ అంకురసంస్థల రంగం సాధించిన అద్భుతమైన విస్తరణే దీనికి నిదర్శనమన్నారు. ఇది లైఫ్ సైన్సెస్, అధునాతన పరిశోధనల్లో సరికొత్త అవకాశాలను సృష్టిస్తోందని ఆయన వివరించారు. ఈ ప్రగతి ద్వారా కొత్త పరిశ్రమలు ఏర్పాటవుతాయని, దేశీయ సామర్థ్యాలు పటిష్ఠమవుతాయని, దేశానికి మరింత ఆర్థిక విలువ చేకూరుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు.

పరిశోధన ప్రాజెక్టులు ప్రారంభమయ్యే తొలి దశ నుంచే పరిశ్రమల భాగస్వామ్యం ఉండాలని డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రముఖంగా ప్రస్తావించారు. దీనివల్ల మార్కెట్ అవసరాలను అర్థం చేసుకోవడం, అవసరమైన సాంకేతికతలను గుర్తించడం, వాణిజ్యపరంగా మార్కెట్లోకి సులభంగా విడుదల చేయగల పరిష్కారాలను అభివృద్ధి చేయడం శాస్త్రవేత్తలకు సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. లాబొరేటరీల్లో జరిగే కొత్త ఆవిష్కరణలను నమూనాలుగా, మార్కెట్‌కు అనుకూలమైన ఉత్పత్తులుగా మార్చడంలో... పరిశోధకులను వ్యాపారవేత్తలతో అనుసంధానించడం, పెట్టుబడులను ప్రోత్సహించడం, బలమైన భాగస్వామ్యాలను నిర్మించడంలో పీహెచ్‌డీసీసీఐ వంటి పారిశ్రామిక సంస్థలు కీలక పాత్ర పోషించగలవని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

ప్రభుత్వ పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల (ఆర్‌డీఐ) కార్యక్రమాన్ని ప్రస్తావిస్తూ... శాస్త్రీయ ఆవిష్కరణలను వేగంగా వాణిజ్య ఉత్పత్తులుగా మార్చడానికి పరిశోధన, అభివృద్ధి రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం మరింతగా పెరగడం ఎంతో అవసరమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. పరిశోధనల ఆధారంగా జరిగే సరికొత్త ఆవిష్కరణల్లో పరిశ్రమలు మరింత చురుగ్గా పాల్గొనాలని ఆయన ప్రోత్సహించారు. శాస్త్రీయ నైపుణ్యాలు స్థిరమైన వ్యాపారాలుగా, ప్రపంచస్థాయి ఉత్పత్తులుగా మారేలా ఒక బలమైన వ్యవస్థను నిర్మించడంలో పరిశ్రమలు తమ వంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

కృత్రిమ మేధ, డేటా మౌలిక సదుపాయాలు, అధునాతన తయారీ రంగాల్లో భారత్ ఆశయాలను నెరవేర్చడానికి స్వదేశీ సాంకేతికతలు, నమ్మకమైన ఇంధన సరఫరా ఎంతో కీలకమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. వ్యూహాత్మక, అభివృద్ధి చెందుతున్న సరికొత్త సాంకేతిక రంగాల్లో సొంత సామర్థ్యాలను పెంపొందించుకోవడంతో పాటు... పరిశ్రమలకు, శాస్త్రీయ పరిశోధన సంస్థలకు మధ్య బలమైన భాగస్వామ్య ఏర్పాటు భారత సాంకేతిక స్వయం సమృద్ధిని, వ్యూహాత్మక సార్వభౌమత్వాన్ని పటిష్ఠం చేయడం కోసం అత్యంత అవసరమని ఆయన స్పష్టం చేశారు.

నూతన ఆలోచనలను వేగవంతమైన అమలుతో, విజయవంతమైన ఆవిష్కరణలను విస్తరించే సామర్థ్యంతో అనుసంధానించడంపైనే భారత తదుపరి ముందడుగు ఆధారపడి ఉంటుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థలు, అంకురసంస్థల మధ్య బలమైన భాగస్వామ్యాలు... వాణిజ్యీకరణను వేగవంతం చేయడానికి, దేశ ఆవిష్కరణల పునాదిని విస్తరించడానికి, 2047 నాటికి భారత ఆశయాలను సాకారం చేసుకోవడం కోసం అవసరమైన సాంకేతిక సామర్థ్యాలను పెంపొందించడానికి ఎంతగానో సహాయపడతాయని ఆయన తెలిపారు.

## సారపాక అభివృద్ధికి కృషి చేయాలని వినతి



ఖమ్మం, అక్టోబర్ 12:జిల్లా బూర్గంపాడు మండలం సారపాక ప్రాంతంలో మౌలిక వసతుల కల్పన కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ ఆధ్వర్యంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు.

సారపాక సెంటర్ నుంచి ఇరవెండి వరకు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం చేపట్టి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి. సారపాక సెంటర్ నుంచి బూర్గంపాడు వరకు కిలోమీటరు మేర రోడ్డు నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సౌకర్యం కల్పించాలి. అలాగే, సారపాక ప్రజల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరిస్తూ, బ్రిడ్జి సమీపంలో అనువైన స్థలంలో శాశ్వత ప్రాతిపదికన స్మశాన వాటిక ఏర్పాటు చేయాలి. ప్రజల రవాణా ఇబ్బందులను తొలగించి, రాత్రి వేళల్లో రాకపోకలు సులభతరం చేసేలా సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని నాయకులు ఎమ్మెల్యేను కోరారు.

## యువ సంగమం ఏడో దశలో భాగంగా అస్సాం సుసంపన్నం

న్యూఢిల్లీ, అక్టోబర్ 12: భారత యువతలో సాంస్కృతిక, భావోద్వేగ బంధాలను బలపరచడానికి 'ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్' చొరవలో భాగంగా విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఉన్నత విద్యా శాఖ 'యువ సంగమం' ఏడో విడత కార్యక్రమాన్ని నిర్వహించింది.

20 జంట రాష్ట్రాలు, ఉన్నత విద్యా సంస్థల ద్వారా పరస్పర అవగాహనను, జాతీయ సమైక్యతను పెంపొందిస్తూ... వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సాంస్కృతిక వారసత్వాన్ని, సంప్రదాయాలను, విద్యా రంగాన్ని, అభివృద్ధి అంశాలను అన్వేషించడానికి ఈ కార్యక్రమం యువ భాగస్వాములకు అవకాశం కల్పించింది.

కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయం నేతృత్వంలోని తెలంగాణ బృందం 2026 అక్టోబర్ 4న గౌహతికి చేరుకున్న సందర్భంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గౌహతి ఘన స్వాగతం పలికింది.

తెలంగాణ బృందం అస్సాంలో 2026 అక్టోబర్ 5న ఒక ఉత్తేజకరమైన యోగా సెషన్‌తో తమ పర్యటనను ప్రారంభించింది. భారతదేశ సంప్రదాయ విజ్ఞానం, సాంస్కృతిక వారసత్వంలోని ఒక ముఖ్యమైన కోణాన్ని అనుభూతి చెందుతూనే... యువ ప్రతినిధులు తమ రోజును ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, సానుకూల శక్తితో ప్రారంభించడానికి ఈ సెషన్ చక్కటి అవకాశాన్ని అందించింది.

తెలంగాణ ప్రతినిధి బృందం అదే రోజున అస్సాం గవర్నర్ శ్రీ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్యను మర్యాదపూర్వకంగా కలుసుకుంది.






## మళ్లీ మూతపడిన వలిగొండ రోడ్డు జంక్షన్

**ప్రజలకు తప్పని తిప్పలు.. జంక్షన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్**

నల్గొండ, అక్టోబర్ 12: చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న వలిగొండ క్రాస్ రోడ్డు జంక్షన్‌ను ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండానే మళ్లీ మూసివేయడంపై స్థానిక నాయకులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై చెరుకు శివకుమార్ గౌడ్ తీవ్ర నిరసన తెలిపారు.

గతంలో స్థానికుల సుదీర్ఘ పోరాటంతో స్పందించిన అధికారులు రహదారిని ఒకసారి పునరుద్ధరించినప్పటికీ, ఇప్పుడు మళ్లీ మూసివేయడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి దాటేందుకు సురక్షితమైన మార్గం కల్పించాలని, వలిగొండ రోడ్డు జంక్షన్‌ను వెంటనే పునరుద్ధరించాలని చెరుకు శివకుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.

ప్రజల సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని ఆయన స్పష్టం చేశారు. జంక్షన్‌ను పునరుద్ధరించి ప్రజలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహిస్తామని హెచ్చరించారు.

## జాతీయస్థాయి గట్కా పోటీలకు నిజామాబాద్ విద్యార్థి ఎంపిక

నిజామాబాద్, అక్టోబర్ 12: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర గట్కా పోటీల్లో నిజామాబాద్ జిల్లా చందూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి బి. నరహరి రజత పతకం సాధించాడు.

తన అద్భుతమైన ప్రతిభతో రాష్ట్రస్థాయిలో పతకాన్ని కైవసం చేసుకున్న నరహరి, తద్వారా ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి గట్కా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగమ్మ వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించిన నరహరిని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగమ్మ, పాఠశాల పీడీ శ్రీనివాస్, గట్కా కోచ్ శ్రీనివాస్, పీడీలు గణేష్, వెంకట్ రాములు అభినందించారు. రాబోయే జాతీయస్థాయి పోటీల్లోనూ నరహరి మరింత ప్రతిభ కనబరిచి దేశస్థాయిలో పతకం సాధించాలని వారు ఆకాంక్షించారు.

## సెల్‌ఫోన్ గొడవ.. స్నేహితుడి ప్రాణం తీసిన మద్యం మత్తు

నిజామాబాద్, అక్టోబర్ 12: చిన్నపాటి సెల్‌ఫోన్ వివాదం ఇద్దరు ప్రాణ స్నేహితుల మధ్య ప్రాణాంతక వైరానికి దారి తీసింది. మద్యం మత్తులో క్షణికావేశం ఒక యువకుడి ప్రాణాలను బలిగొనగా, మరొకరిని కటకటాల వెనక్కి నెట్టింది. నిజామాబాద్ నగరంలోని మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీకి చెందిన గంగోని వినోద్, అతని స్నేహితుడు జయంత్ ఈ నెల 8వ తేదీ తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో సెల్‌ఫోన్ విషయమై ఇద్దరి మధ్య చిన్నపాటి వాగ్వాదం చెలరేగింది.

మాటామాటా పెరిగి వివాదం ముదరడంతో మద్యం మత్తులో ఉన్న జయంత్ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. విచక్షణ కోల్పోయి అక్కడే ఉన్న బండరాయితో వినోద్ తలపై బలంగా బాదాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన వినోద్ రక్తపు మడుగులో కుప్పకూలిపోయాడు.

ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వినోద్‌ను కుటుంబ సభ్యులు వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆయన పరిస్థితి అత్యంత విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. గత కొన్ని రోజులుగా మృత్యువుతో పోరాడిన వినోద్ అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 11వ తేదీ రాత్రి తుదిశ్వాస విడిచాడు.

ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. నిందితుడిపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. చిన్నపాటి సెల్‌ఫోన్ వివాదంతో స్నేహితుడే స్నేహితుడిని హతమార్చడంతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

# పనిమనిషి ముసుగులో హంతకురాలు!

**ఇంటి పనిమనిషి ముసుగులో 8 తులాల బంగారు ఆభరణాలు చోరీ అపై హత్య**
**కామారెడ్డిలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య,**
**దోపిడి కేసును ఛేదించిన కామారెడ్డి పట్టణ పోలీసులు**
**పక్కా పథకంతో భర్త సహాయముతో పనిమనిషే గొంతు నులిమి దారుణ హత్య**
**పనిమనిషి ముసుగులో దొంగతనాలు విచారణలో గతనేర చరిత్ర**




కామారెడ్డి, అక్టోబర్ 12: (నేటి నిజం ప్రతినిధి): పనిమనిషి ముసుగులో దొంగతనాలు విచారణలో గతనేర చరిత్ర బట్టబయలు..గతంలోనూ ఇంట్లో బంగారం చోరీ!కేసును చాకచక్యంగా ఛేదించిన కామారెడ్డి పోలీసు బృందాన్ని అభినందించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, కామారెడ్డి పట్టణంలోని ముష్రిబాగ్‌కు చెందిన చిట్మల్ అనసూయ (66) ను తేదీ 29.09.2026న సాయంత్రం 6 గంటల నుంచి 7.30 గంటల మధ్య హత్య చేసి, ఆమె ధరించిన బంగారు ఆభరణాలను దోచుకెళ్లారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి వచ్చేసరికి అనసూయ మంచంపై అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. ఆమె మెడపై గాయాల గుర్తులు ఉండటంతో పాటు, బంగారు పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కామారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు హత్య, దోపిడి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఆదేశాల మేరకు, కామారెడ్డి డీఎస్పీ ఎన్. మధుసూదన్ పర్యవేక్షణలో పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి తో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. సంఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, సాంకేతిక సమాచారం, ఇతర దర్యాప్తు వివరాలను విశ్లేషిస్తూ నిందితుల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించారు. దర్యాప్తులో భాగంగా మృతురాలి ఇంట్లో గత కొంతకాలంగా పనిమనిషిగా పనిచేస్తున్న రజితపై అనుమానం రావడంతో పోలీసులు ఆమె ప్రతీ కదలికలపై దృష్టి సారించారు. ఈ క్రమంలో రజిత, ఆమె భర్త నర్సింగ్‌లను గంజ్ పాఠశాల సమీపంలో అదుపులోకి తీసుకొని విచారించగా, నేరానికి సంబంధించిన వివరాలు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

పక్కా పథకంతో హత్య చేసి ఆభరణాలు దోపిడీ పోలీసుల విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం.. పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించాలనే దురాలోచనతో రజిత, నర్సింగ్‌లు మృతురాలి అనసూయ ఇంట్లో ఉన్న బంగారు ఆభరణాలను దొంగిలించాలని పథకం వేసుకున్నారు. అయితే, తమను అనసూయ గుర్తుపట్టే అవకాశం ఉండటంతో ఆమెను హత్య చేసి ఆభరణాలను దోచుకోవాలని నిర్ణయించుకున్నట్లు విచారణలో వెల్లడైంది. పథకం ప్రకారం, 29.09.2026న అనసూయ భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో అనసూయ ఒక్కతే ఇంట్లో ఉంది అని రజిత తన భర్త నర్సింగ్‌తో కలిసి అనసూయ ఇంట్లోకి ప్రవేశించారు. అనసూయ పూజ చేస్తుండగా విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ఆమెను కింద పడేసి మరో గదిలోని ఈడ్చుకెళ్లారు. అనంతరం ఒక తువ్వాలుతో గొంతుపై గట్టిగా బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైంది. ఆమె మరణించినట్లు నిర్ధారించుకున్న అనంతరం, ఆమె ధరించిన బంగారు పుస్తెల తాడు, రెండు ఉంగరాలు, చెవి ఆభరణాలను తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. నేరంపై అనుమానం రాకుండా రజిత యథావిధిగా అనసూయ ఇంట్లో పనులకు వెళ్ళి వచ్చినట్లుగా నటించారని విచారణలో వెల్లడైంది.గతంలోనూ మరో ఇంట్లో చోరీవిచారణలో రజిత గతంలో కామారెడ్డిలోని భూమయ్య ఇంట్లో పనిమనిషిగా పనిచేసిన సమయంలోనూ బంగారు ఆభరణాలను దొంగిలించినట్లు తెలిపారు. 2023 సెప్టెంబర్‌లో ఇంటి యజమాని బయటకు వెళ్లగా, ఆయన భార్య తమ కుమార్తెను రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కించేందుకు వెళ్లిన సమయంలో, ఇంట్లో ఎవరులేరని సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడు, 5 గ్రాముల బంగారు చెవి కమ్మలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడించినట్లు తెలిపారు.

నిందితుల వివరాలు:బోసు రజిత, భర్త: నర్సింగ్ (40), నివాసం: బతుకమ్మ కుంట, కామారెడ్డి. 2. బోసు నర్సింగ్, తండ్రి: యాదయ్య,(48) నివాసం: బతుకమ్మ కుంట, కామారెడ్డి.స్వాధీనం చేసుకున్న సొత్తు:బంగారు పుస్తెల తాడు (మంగళసూత్రం). రెండు బంగారు ఉంగరాలు. 3: చెవి ఆభరణాలు.(మొత్తం సుమారు 8 తులాల బంగారు ఆభరణాలు.)4:నిందితురాలి సెల్‌ఫోన్.

ఈ కేసులో నిందితులైన భార్యాభర్తలు ఇద్దరిని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసి, నిందితులను గుర్తించడంలో కీలక పాత్ర పోషించిన కామారెడ్డి పట్టణ పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి. నరహరి, ఏఎస్ఐ రంగారావు, పోలీస్ కానిస్టేబుళ్లు రామస్వామి, రాజు నాయక్, సంపత్‌లను జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, అభినందించారు. వారి విధి నిర్వహణ, అంకితభావం, ప్రతిభను ప్రశంసించారు.

## జుక్కల్‌లో వైభవంగా బతుకమ్మ సంబరాలు

**రూ. 51 వేల తొలి బహుమతి**



కామారెడ్డి, అక్టోబర్ 12:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటేలా జుక్కల్ నియోజకవర్గ స్థాయి బతుకమ్మ సంబరాలను మంగళవారం జుక్కల్ మండల కేంద్రంలోని గుండూర్ రోడ్డు వద్ద ఘనంగా నిర్వహించనున్నారు.

లఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి తోట అర్చన ఆధ్వర్యంలో మధ్యాహ్నం 3 గంటలకు ఈ వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ సంబరాలకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మొదటి బహుమతి రూ. 51,000, రెండో బహుమతి రూ. 25,000, మూడో బహుమతిరూ 11,000, కన్సోలేషన్ బహుమతులు: 8 మందికి అందించనున్నారు. ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ ప్రాముఖ్యతను భావితరాలకు, ప్రపంచానికి చాటాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. నియోజకవర్గంలోని ఆడపడుచులందరూ భారీ సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేయాలని కోరారు. హాజరయ్యే అందరికీ భోజన వసతి కల్పించినట్లు తెలిపారు.

## నిరుపేద కుటుంబానికి మానాల ట్రస్ట్ అండ

**ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి 50 సిమెంట్ బస్తాల పంపిణీ**

నిజామాబాద్, అక్టోబర్ 12:: కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ తోడేటి శాంత నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇంటికి మానాల ట్రస్ట్ అండగా నిలిచింది. ట్రస్ట్ తరఫున ఆదివారం ఆమెకు 50 సిమెంట్ బస్తాలను ఉచితంగా అందజేశారు. ఇంటి నిర్మాణానికి సాయం చేసిన మాజీ డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డికి లబ్ధిదారురాలు శాంత, ఆమె కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోనగిరి భాస్కర్, జిల్లా నాయకులు తిప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు నరేష్, విజయ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, రవి, సధనాద్, శేఖర్, గంగారెడ్డి, క్రాంతి, రాజేశ్వర్, ముఖీమ్ తదితరులు పాల్గొన్నారు.

# “విభిన్న దేశాలు, విభిన్న విమానాలు, విభిన్న అనుభవాలు.. కానీ ఆకాశం ఒక్కటే. ఇదే తరంగ్ శక్తి సందేశం”: రక్షణమంత్రి

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12: జోధ్‌పూర్‌లోని వైమానిక దళ కేంద్రంలో తరంగ్ శక్తి?2026 రెండో విడత విన్యాసంలో పాల్గొన్న వారిని ఉద్దేశించి అక్టోబర్ 10న రక్షణశాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగించారు. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 12 వరకు ఈ బహుళజాతి వైమానిక విన్యాసాలు నిర్వహిస్తున్నారు. ఇందులో ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, జర్మనీ, శ్రీలంక, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, అమెరికా సహా ఏడు స్నేహపూర్వక విదేశీ దేశాల వైమానిక దళాలు పాల్గొన్నాయి. వీటితో పాటు 32 దేశాల ప్రతినిధులు పరిశీలకులుగా హాజరయ్యారు.

ఈ విన్యాసాలను విజయవంతంగా నిర్వహించిన భారత వైమానిక దళంతో పాటు ఇందులో భాగస్వాములైన అన్ని సంస్థలు, సిబ్బందిని రక్షణ మంత్రి అభినందించారు. పాల్గొన్న దేశాలకు స్వాగతం పలుకుతూ... వృత్తిపరమైన అవగాహనను పెంపొందించడం, కార్యాచరణ పరమైన సహకారాన్ని బలోపేతం చేయడంలో ఆయా దేశాలు అందించిన సహకారాన్ని ప్రశంసించారు. పాల్గొన్న దేశాల వైమానిక దళాల ఉనికి ఈ విన్యాసాలకు గణనీయమైన విలువను అందించిందని ఆయన పేర్కొన్నారు. ఈ విన్యాసాల ద్వారా విలువైన వృత్తిపరమైన అనుభవాలు, దేశ సామర్థ్యాలు, దృక్పథాలపై మరింత లోతైన అవగాహనతో ఆయా దేశాల బృందాలు తమ దేశాలకు తిరిగి వెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక యుద్ధరంగంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోవడానికి రక్షణ రంగంలో స్వావలంబన, సాంకేతిక ఆవిష్కరణలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలు ఎంతో కీలకమని రక్షణ మంత్రి స్పష్టం చేశారు.

సభను ఉద్దేశించి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ప్రసంగిస్తూ... ఆధునిక యుద్ధ విధానాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు. సంప్రదాయంగా భూమి, సముద్రం, ఆకాశానికి పరిమితమైన యుద్ధ రంగాలు ప్రస్తుతం అంతరిక్షం, సైబర్ రంగం, విద్యుదయస్కాంత తరంగాల పరిధి, సమాచార రంగాలకు కూడా విస్తరించాయని వివరించారు. మానవరహిత వ్యవస్థలు, డ్రోన్లు, కృత్రిమ మేధ, ఎలక్ట్రానిక్ యుద్ధ విధానాలు, సుదూర లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే ఆయుధాలు ఆధునిక సైనిక కార్యకలాపాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన తెలిపారు.

“భవిష్యత్తులో సైనిక శక్తి సామర్థ్యం మన వద్ద ఎన్ని ఆయుధ వేదికలు ఉన్నాయనే దానిపై మాత్రమే ఆధారపడి ఉండదు. పరిస్థితులను ఎంత వేగంగా గుర్తించగలుగుతున్నాం, అర్థం చేసుకోగలుగుతున్నాం, నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం, చర్యలు చేపట్టగలుగుతున్నాం అనే అంశాలే దానిని నిర్ణయిస్తాయి” అని ఆయన పేర్కొన్నారు. సైనిక సామర్థ్యంలో వేగం, కచ్చితత్వం, సమాచారం, సమన్వయం కీలక లక్షణాలుగా మారాయని స్పష్టం చేశారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో రక్షణ రంగంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో ముడిపడిన అనిశ్చితులను దృష్టిలో ఉంచుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో ఎదురవుతున్నభద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశం తన సామర్థ్యాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరాన్ని భారత్ గుర్తించిందని రక్షణ మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రక్షణ రంగంలో స్వావలంబనను జాతీయ విధానంగా స్వీకరించిందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం పాటు యుద్ధాలు కొనసాగినప్పుడు, అనిశ్చిత పరిస్థితులు ఎదురైనప్పుడు దేశం తన అవసరాలను తానే తీర్చుకునేలా సొంతంగా ఆయుధాలు, కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

భారత రక్షణ దళాల్లో చోటుచేసుకున్న మార్పులను ప్రస్తావిస్తూ.. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో పరిమిత వనరులతో పనిచేసిన భారత వైమానిక దళం నేడు ఆధునిక విమానాలు, లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే ఆయుధాలు, అత్యాధునిక సెన్సార్లు, సమగ్ర సమాచార వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాలతో కూడిన ఆధునిక అంతరిక్ష-వైమానిక శక్తిగా ఎదిగిందని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఆత్మనిర్భర్ భారత్ అంటే ప్రపంచానికి దూరంగా ఉండటం కాదు అని ఆయన స్పష్టం చేశారు. కీలక రక్షణ సాంకేతిక పరిజ్ఞానాన్ని దేశీయంగా రూపకల్పన చేయడం, అభివృద్ధి చేయడం, తయారు చేయడం, నిర్వహించడం, అవసరాలకు అనుగుణంగా ఆధునీకరించడం వంటి సామర్థ్యాలను దేశంలోనే పెంపొందించుకోవడమే స్వావలంబన లక్ష్యమని వివరించారు.

భారత్‌లో అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, రక్షణ పరికరాల తయారీ వ్యవస్థను ప్రస్తావిస్తూ.. స్వదేశీ రక్షణ కార్యక్రమాలు, వ్యవస్థల గురించి రక్షణ మంత్రి వివరించారు. వీటిలో తేజస్ యుద్ధ విమానం, ధ్రువ్, రుద్ర, ప్రచండ్ హెలికాప్టర్లు, లైట్ యుటిలిటీ హెలికాప్టర్ (ఎల్‌యూహెచ్), ఆకాశ్ వైమానిక రక్షణ వ్యవస్థ, ఏఈఎన్ఏ రాడార్లు, ఎలక్ట్రానిక్ వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న మానవరహిత, ఏరోస్పేస్ సాంకేతిక పరిజ్ఞానాలు ఉన్నాయి. అయిదో తరం ఆధునిక యుద్ధ విమాన సాంకేతిక పరిజ్ఞానంలో ప్రావీణ్యం సాధించే దిశగా అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) కార్యక్రమం కీలక ముందడుగు అని రక్షణ మంత్రి పేర్కొన్నారు. అధునాతన విమాన ఇంజిన్ల అభివృద్ధి, వాటి సహ తయారీకి కూడా ప్రాధాన్యత ఉందని వివరించారు. పరిశోధన, సంయుక్త అభివృద్ధి, సహ ఉత్పత్తి, నిర్వహణ, శిక్షణ, ఆవిష్కరణల రంగాల్లో ఒకే విధమైన లక్ష్యాలు కలిగిన దేశాలతో సహకారాన్ని పెంపొందించుకోవడానికి భారత్ ఆసక్తిగా ఉందని ఆయన తెలిపారు. పరస్పర విశ్వాసంతో కూడిన భాగస్వామ్యాలు, సంక్షోభాలను తట్టుకోగల సరఫరా వ్యవస్థల ప్రాముఖ్యత పెరుగుతోందని పేర్కొంటూ,, “భవిష్యత్తులో రక్షణ సంబంధాలు కేవలం ఆయుధ వేదికలకే పరిమితం కావు.. సాంకేతికత, పరస్పర విశ్వాసమే వాటికి పునాది” అని అన్నారు.

బలమైన స్వదేశీ సామర్థ్యాలను నిర్మించుకోవడంతో పాటు, విశ్వసనీయ భాగస్వామ్య దేశాలతో అర్థవంతమైన సహకారాన్ని కొనసాగించాలని రక్షణశాఖ మంత్రి పేర్కొన్నారు. అవసరమైనప్పుడు భారత్ స్వతంత్రంగా చర్యలు తీసుకోగలగాలని, అదే సమయంలో ఇతర దేశాల ప్రయోజనాలు, బాధ్యతలు కలిసివచ్చినప్పుడు వాటితో సమర్థవంతంగా కలిసి పనిచేయగలగాలని ఆయన పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో సామర్థ్యం, సాంకేతికత, పరస్పర కార్యాచరణ సమన్వయం, విశ్వాసం వంటి సూత్రాలను ఆచరణాత్మక అనుభవంగా మార్చడంలో తరంగ్ శక్తి విన్యాసం కీలకమని రక్షణ మంత్రి పేర్కొన్నారు. ఈ విన్యాసం ద్వారా పాల్గొన్న దేశాల వైమానిక దళాలు కలిసి పనిచేయడానికి, కార్యాచరణకు సంబంధించిన జ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడానికి, విధివిధానాలను పరిశీలించడానికి, వివిధ రకాల విమానాలు, సైనిక వ్యూహాలు, మిషన్ ప్రణాళికల విధానాలను అర్థం చేసుకోవడానికి అవకాశం లభించిందని తెలిపారు. బహుళజాతి సైనిక విన్యాసాల ద్వారా వైమానిక సిబ్బంది, కమాండర్లు ఒకరి నుంచి మరొకరు నేర్చుకోవచ్చని, ఇప్పటికే అనుసరిస్తున్న విధానాలను పరిశీలించవచ్చని, వ్యవస్థలు, ప్రక్రియలను మెరుగుపరచుకునేందుకు ఉన్న అవకాశాలను గుర్తించవచ్చని ఆయన వివరించారు.

ఈ విన్యాస స్ఫూర్తిని వివరిస్తూ.. “వేర్వేరు దేశాలు.. వేర్వేరు విమానాలు.. వేర్వేరు అనుభవాలు.. కానీ ఆకాశం ఒక్కటే. ఇదే తరంగ్ శక్తి సందేశం” శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అని అన్నారు. ఈ విన్యాసం విలువ కేవలం నిర్వహించిన విమానయాన కార్యకలాపాలు, సాధన చేసిన యుద్ధ పరిస్థితులకే పరిమితం కాదని తెలిపారు. భాగస్వామ్య దేశాల సైనిక దళాలతో సమర్థవంతంగా సమాచారాన్ని పంచుకోవడం, సమన్వయంతో పనిచేయడం, కలిసి కార్యకలాపాలు నిర్వహించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం కూడా ఇందులో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ విన్యాసాల ద్వారా నేర్చుకున్న పాఠాలను శిక్షణ, యుద్ధ వ్యూహాలు, సాంకేతికత, సైనిక సిద్ధాంతాలు, భవిష్యత్తు సామర్థ్యాల అభివృద్ధిలో భారత వైమానిక దళం భాగం చేయాలని రక్షణశాఖ మంత్రి పిలుపునిచ్చారు. ఈ విన్యాసంలో ఏర్పడిన వృత్తిపరమైన సంబంధాలు, పరస్పర అవగాహనను ముందుకు తీసుకెళ్లి, ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో సహకారానికి కొత్త మార్గాలను అన్వేషిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

2024లో నిర్వహించిన తొలి విడత విజయాల ఆధారంగా తరంగ్ శక్తి విన్యాసం రెండో విడత కొనసాగుతోంది. రక్షణ రంగంలో నిర్మాణాత్మక భాగస్వామ్యానికి, అంతర్జాతీయ సహకారానికి భారత్ కట్టుబడి ఉందనే విషయాన్ని ఈ విన్యాసం మరోసారి చాటిచెప్పింది. ఈ విన్యాసంలో వివిధ రకాల యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, నిఘా విమానాలు, గగనతలంలోనే ఇంధనం నింపే సామర్థ్యాలు కలిగిన విమానాలు పాల్గొన్నాయి. దీనివల్ల ఉమ్మడి మిషన్ల ప్రణాళిక, కార్యాచరణ అనుభవాల పరస్పర మార్పిడి, వివిధ దేశాల వైమానిక దళాల మధ్య సమన్వయ సామర్థ్యాన్ని మెరుగుపరచుకునే అవకాశాలు లభించాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్, తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ (ఎల్‌సీహెచ్) ప్రచండ్ వంటి వేదికల భాగస్వామ్యం.. విమానయాన, అంతరిక్ష రంగాల రూపకల్పన, ఇంజినీరింగ్, తయారీలో భారత్ సాధించిన పురోగతిని కూడా ప్రతిబింబించింది.

ఆపరేషన్ సిందూర్‌లో వైమానిక శక్తి నిర్ణయాత్మక పాత్ర పోషించడం ఈ విన్యాసం సమకాలీన ప్రాధాన్యతను మరింత స్పష్టం చేసింది. జాతీయ భద్రతా లక్ష్యాల సాధన కోసం కచ్చితమైన, సమతుల్యమైన, సమర్థవంతమైన కార్యకలాపాలను నిర్వహించే సామర్థ్యం భారత వైమానిక దళానికి ఉందని ఈ ఆపరేషన్ నిరూపించింది. సంక్లిష్టమైన భద్రతా పరిస్థితుల్లో కార్యాచరణ సంసిద్ధత, సమగ్ర ప్రణాళిక, విశ్వసనీయ నిరోధక సామర్థ్యం, వైమానిక శక్తిని సమర్థవంతంగా వినియోగించడం ఎంత ముఖ్యమో ఈ ఆపరేషన్ చాటిచెప్పింది. కార్యాచరణలో పొందిన అనుభవం.. వృత్తిపరమైన అవగాహనను పెంపొందించడంలో, ఆధునిక యుద్ధరంగంలో మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధం కావడంలో తరంగ్ శక్తి వంటి బహుళజాతి విన్యాసాల ప్రాధాన్యతను మరింత బలపరుస్తోంది.

విమానయాన కార్యకలాపాలకే పరిమితం కాకుండా.. ఈ విన్యాసంలో వృత్తిపరమైన చర్చలు, పారిశ్రామిక సంస్థల సందర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఇందులో భాగంగా యోగా కార్యక్రమాలు, చారిత్రక వారసత్వ ప్రదేశాల సందర్శనలు, పాల్గొన్న దేశాల సంప్రదాయాలను చాటిచెప్పే అంతర్జాతీయ సాయంత్రపు వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్ ఎస్. రాజా సుబ్రమణి, వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్, నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, ఇతర ప్రముఖులు, రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు, పాల్గొన్న దేశాల ప్రతినిధులు హాజరయ్యారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

### అర్జీలపై సమగ్ర విచారణ జరిపి నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలి

కరీంనగర్, అక్టోబర్ 12: ప్రజావాణి ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, వినతులపై సమగ్ర విచారణ జరిపి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ మండలాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణికి వస్తున్నారని తెలిపారు. ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదును అధికారులు బాధ్యతాయుతంగా తీసుకోవాలని, సంబంధిత సమస్యపై సమగ్ర విచారణ జరిపి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణిలో అందిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 49 ఫిర్యాదులు, వినతులు అందాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంతో పాటు దరఖాస్తుదారులకు తగిన సమాచారం అందించాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో కె. వై. ప్రసాద్, ఆర్డీవోలు మధుసూదన్, జీవాకర్‌రెడ్డి, నరసింహారావు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి గట్కా పోటీలకు నిజామాబాద్ విద్యార్థి ఎంపిక

### రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించిన నరహరి

నిజామాబాద్, అక్టోబర్ 12: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర గట్కా పోటీల్లో నిజామాబాద్ జిల్లా చందూర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి బి. నరహరి రజత పతకం సాధించాడు.

తన అద్భుతమైన ప్రతిభతో రాష్ట్రస్థాయిలో పతకాన్ని కైవసం చేసుకున్న నరహరి, తద్వారా ఢిల్లీలో జరగనున్న జాతీయస్థాయి గట్కా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగమ్మ వెల్లడించారు. రాష్ట్రస్థాయిలో రజత పతకం సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించిన నరహరిని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగమ్మ, పాఠశాల పీడీ శ్రీనివాస్, గట్కా కోచ్ శ్రీనివాస్, పీడీలు గణేష్, వెంకట్ రాములు అభినందించారు. రాబోయే జాతీయస్థాయి పోటీల్లోనూ నరహరి మరింత ప్రతిభ కనబరిచి దేశస్థాయిలో పతకం సాధించాలని వారు ఆకాంక్షించారు.

## కోల్‌కతాలోని జీఆర్ఎస్ఈలో జలప్రవేశం చేసిన తదుపరి తరం ఆఫ్‌షోర్ పెట్రోల్ నౌక (యార్డ్ 3040, శ్రేయస్)

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12:కోల్‌కతాలోని జీఆర్ఎస్ఈలో 2026 అక్టోబర్ 10న నావల్ స్టాఫ్ వైస్ చీఫ్ వైస్ అడ్మిరల్ అజయ్ కొచ్చర్ సమక్షంలో శ్రీమతి రేమాన్ కొచ్చర్.. తదుపరి తరం ఆఫ్‌షోర్ పెట్రోల్ నౌక (ఎన్‌జీఓపీవీ) అయిన యార్డ్ 3040ను (శ్రేయస్) జలప్రవేశం చేయించారు. ఈ వేడుక భారత నావికాదళానికి ఉన్న ఉన్నత సంప్రదాయాలను, విలువలను తెలియజేస్తోంది. ఈ కార్యక్రమంలో భారత నావికాదళం, రక్షణ మంత్రిత్వ శాఖ, జీఆర్ఎస్ఈ, పరిశ్రమ భాగస్వాముల నుంచి సీనియర్ ప్రముఖులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రెండు షిప్‌యార్డ్‌లు (గోవాలోని జీఎస్ఎల్, కోల్‌కతాలోని జీఆర్ఎస్ఈ) ఎన్‌జీఓపీవీలను నిర్మిస్తున్నాయి. స్వదేశీ పరిజ్ఞానంతో రూపకల్పన చేసి నిర్మించిన ఈ నౌకలు.. సముద్ర నిఘా (మారిటైమ్ సర్వైలెన్స్), అన్వేషణ- రక్షణ (సెర్చ్- రెస్క్యూ), ఆఫ్‌షోర్ ఆస్తుల పరిరక్షణ, మానవతా దృక్పథంతో చేసే విపత్తు సహాయక చర్యలు (హెచ్ఏడీఆర్), సముద్రపు దొంగల నిరోధక చర్యలు వంటి వివిధ రకాల కార్యకలాపాలలో ప్రస్తుతం ఉన్న ఓపీవీలు లేదా ఎన్ఓపీల సామర్థ్యాన్ని మరింత పెంచుతాయి. భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి అనుగుణంగా ఈ నౌకల పేర్లు పెట్టారు. సంస్కృతంలో ‘శ్రేయస్’ అనగా ‘ఉత్తమమైనది’ లేదా ‘శ్రేష్ఠమైనది’ అని అర్థం.

ఈ జలప్రవేశం భారత నావికాదళం స్వదేశీ నౌకా నిర్మాణంలో సాధించిన మరో కీలక ఘట్టాన్ని సూచిస్తుంది.

## యువతలో క్రీడాస్ఫూర్తిని నింపడమే లక్ష్యం

### బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు మాదరి శ్రీకాంత్

వరంగల్, అక్టోబర్ 12: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ములుగు జిల్లా భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో తాడ్వాయి మండలం మేడారం గ్రామంలోని మేడారం యూత్ గ్రౌండ్‌లో నిర్వహించిన రెండు రోజుల జిల్లా స్థాయి మెగా వాలీబాల్ క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

క్రీడోత్సవాల ముగింపు కార్యక్రమానికి ములుగు జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరికొండ బలరామ్, బీజేవైఎం ములుగు జిల్లా ఇన్‌చార్జి చింతల రాఘవేందర్ ముదిరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత క్రీడల్లో చురుగ్గా పాల్గొని క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

## బాధితుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు

### -జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



కరీంనగర్, అక్టోబర్ 12:బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు.

ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 14 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకొవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యా దుదారులతో మర్యాదగా మాట్లా డి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాల ని, ఫిరాయ్యదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యా దును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## కార్పొరేట్ సామాజిక బాధ్యతపై మూడో జాతీయ సదస్సు, ప్రదర్శనను ప్రారంభించిన కోల్, గనుల శాఖ సహాయమంత్రి (ఎన్‌సీసీఎస్ఆర్-2026)

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 12:కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ (ఐఐసీఏ) న్యూఢిల్లీలో నిర్వహించిన మూడో జాతీయ కార్పొరేట్ సామాజిక బాధ్యత సదస్సు, ప్రదర్శన (ఎన్‌సీసీఎస్ఆర్-2026)ను కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే ప్రారంభించారు. అక్టోబర్ 6 నుంచి 7వ తేదీ వరకు రెండు రోజులపాటు ఈ సదస్సు జరిగింది. “వికసిత్ భారత్ కోసం సీఎస్ఆర్ స్ఫూర్తికి నూతన రూపం: నిబంధనల నుంచి నిబద్ధత దిశగా” ఇతివృత్తంతో నిర్వహించారు.

బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి శ్రీ సతీశ్ చంద్ర దూబే కీలక ఉపన్యాసం ఇచ్చారు. జాతీయ ఆర్థికాభివృద్ధి, ప్రాంతీయ అభివృద్ధి, వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతాల ప్రజల సంక్షేమం మధ్య ఉన్న స్నేహపూర్వక సంబంధాన్ని స్పష్టం చేశారు. ఆర్థిక పురోగతి, ప్రయోజనాలు “బలమైన సమాజం, విస్తృత అవకాశాలు, సుస్థిర ప్రాంతాలుగా మారినప్పుడే పరిపూర్ణమవుతాయి” అని ఆయన పేర్కొన్నారు.

సహజ వనరులు, స్థానిక కమ్యూనిటీలతో బలంగా ముడిపడున్న రంగాలకు సంబంధించి వృద్ధి, సామాజిక అభివృద్ధిని వేర్వేరు లక్ష్యాలుగా చూడలేమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బొగ్గు రంగంలో మరింత నిర్మాణాత్మకమైన, అవసరాల ఆధారంగా, ఫలితాలపై దృష్టి సారించే సీఎస్ఆర్ అమలు విధానాలకు నిర్దిష్ట దిశను అందించేందుకు రూపొందించిన భారత బొగ్గు కంపెనీల సమగ్ర సీఎస్ఆర్ వ్యవస్థను అధికారికంగా విడుదల చేశారు.

భారతదేశంలో మారుతున్న సీఎస్ఆర్ తీరుతెన్నులపై సమగ్ర సమాచారాన్ని అందించే ఇండియా సీఎస్ఆర్ ఫ్యాక్ట్‌బుక్ 2024-25ని ఈ ప్రారంభ సదస్సులో విడుదల చేశారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి డాక్టర్ పల్లవి జైన్ గోవిల్, భారతదేశంలో ఐక్యరాజ్యసమితి మహిళా విభాగం ప్రతినిధి శ్రీమతి షోకో ఇషికావా, ఐఐసీఏ డైరెక్టర్ జనరల్, సీఈఓ శ్రీ జ్ఞానేశ్వర్ కుమార్ సింగ్, ఐఐసీఏ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ స్కూల్ హెడ్ ప్రొఫెసర్ గరిమా దాధీచ్ ఈ సదస్సులో వక్తలుగా వ్యవహరించారు.

కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీమతి పల్లవి జైన్ గోవిల్ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ... భారతదేశ విస్తృత కార్పొరేట్ పాలన, జాతీయాభివృద్ధి పాలన విధానంలో సీఎస్ఆర్‌ను భాగం చేశారు. ఎన్‌సీసీఎస్ఆర్-2026 ఇతివృత్తం వాటాదారులకు “వార్షిక బాధ్యతల పరిధిని మించి ఆలోచించాలి” అని పిలుపునిచ్చిందన్నారు. భారతదేశ అభివృద్ధి ప్రయాణానికి బాధ్యతాయుతమైన సంస్థలు చేయగల సహకారాన్ని పరిగణించాలని ఆమె పేర్కొన్నారు. భారతదేశ ప్రత్యేకమైన చట్టపరమైన సీఎస్ఆర్ నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ... ఈ విధానం చట్టపరమైన బాధ్యతను కంపెనీ స్థాయి బాధ్యత, బోర్డు పర్యవేక్షణ, బహిరంగ వెల్లడి, ప్రభావ అంచనాతో మిళితం చేస్తుందని, వికసిత్ భారత్‌కు అవసరమైన సమష్టి కృషికి సీఎస్ఆర్ కీలకమని స్పష్టం చేశారు. ఆమె ఇండియా సీఎస్ఆర్ ఫ్యాక్ట్‌బుక్ 2024-25ని పుస్తకాన్ని ఆవిష్కరించారు.

ఐఐసీఏ డైరెక్టర్ జనరల్, సీఈఓ శ్రీ జ్ఞానేశ్వర్ కుమార్ సింగ్ ప్రసంగిస్తూ... క్షేత్రస్థాయి అమలు, కనిపించే అభివృద్ధి ఫలితాలపై ఆధారపడి ఉండేలా సీఎస్ఆర్ చర్చలు జరపాల్సిన ప్రాముఖ్యతను స్పష్టం చేశారు. ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రభుత్వ రంగ సంస్థలు, అమలు సంస్థలు, అభివృద్ధి భాగస్వాములు, విద్యావేత్తలను సీఎస్ఆర్ ఏకతాటిపైకి తెస్తుందని పేర్కొంటూ... “బోర్డు గదుల్లో నిర్ణయాలు తీసుకుంటాం. కానీ, వాటి విలువ పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, జీవనోపాధి కార్యక్రమాలు, గ్రామాలు, పట్టణాలు, జిల్లాల్లో ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధానం ద్వారానే కనిపిస్తుంది” అని అభిప్రాయపడ్డారు. కేవలం ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు మాత్రమే కాకుండా, ఫలితాలను అందరికీ తెలియజేసేలా చేసేందుకు, అభ్యాసనం, అనుసరణ, భాగస్వామ్యానికి వేదికగా జాతీయ సీఎస్ఆర్ ప్రదర్శనను రూపొందించినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభ సదస్సు తర్వాత “సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్: ప్రయోజనం, మూలధనం, ప్రభావం” అంశంపై ఫైర్‌సైడ్ చాట్ నిర్వహించారు. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పాలసీ సీనియర్ అడ్వైజర్ శ్రీ శైలేష్ కె. పాఠక్, ప్రొఫెసర్ గరిమా దాధీచ్ ఇందులో వక్తలుగా పాల్గొన్నారు. సామాజిక ప్రయోజనాన్ని మూలధనంతో అనుసంధానించటంలో సోషల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ పాత్రను, సామాజిక రంగ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయుటంలో విశ్వసనీయమైన కొలమానాలు, పారదర్శకత, సంస్థాగత విశ్వాసం ప్రాముఖ్యతను ఈ చర్చలో పరిశీలించారు.

మధ్యాహ్న భోజనం తర్వాత జరిగిన సదస్సులో భారతదేశ ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి శ్రీ అన్షుమాన్ పట్నాయక్ కీలక ప్రసంగం ఇచ్చారు. కార్పొరేట్ పాలన విస్తృతమవుతున్న తరుణంలో సీఎస్ఆర్ ప్రాధాన్యతను వివరిస్తూ... కంపెనీలు సీఎస్ఆర్‌ను బాధ్యాయుతమైన కార్పొరేట్ ప్రవర్తన, సంస్థాగత నిర్ణయాల్లో అంతర్భాగంగా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. సీఎస్ఆర్ భాగస్వాములను అనుసంధానించేందుకు, సార్థకమైన భాగస్వామ్యాన్ని సులభతరం చేసేందుకు సీఎస్ఆర్ ఎక్స్ఛేంజ్ పోర్టల్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ... అందులో నమోదు చేసుకోవాలని కంపెనీలను ఆహ్వానించారు.

ప్రధానోపన్యాసం అనంతరం “సీఎస్ఆర్‌లో బోర్డు పాలన, వ్యూహాత్మక నిబద్ధత” అనే అంశంపై ఉన్నత స్థాయి ప్యానెల్ చర్చ జరిగింది. సీఎస్ఆర్‌పై వ్యూహాత్మక పర్యవేక్షణను నిర్ధారించటంలో బోర్డులు, సీనియర్ మేనేజ్‌మెంట్ పాత్ర, స్పష్టంగా గుర్తించిన అవసరాలు, ఫలితాలతో ఖర్చును అనుసంధానించాల్సిన ప్రాముఖ్యత, సమర్థవంతమైన పర్యవేక్షణ, జవాబుదారీ వ్యవస్థల ఆవశ్యకతపై ఈ ప్యానెల్ చర్చించింది.

ఈ ప్యానెల్‌లో దాల్మియా భారత్ ఫౌండేషన్ సీఈఓ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ మాజీ ఛైర్‌పర్సన్ శ్రీ అశోక్ కుమార్ గుప్తా (రిటైర్డ్), అమృత విశ్వవిద్యాలయం ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మనీషా వి. రమేశ్, ఓఎన్‌జీసీ (ప్రొడక్షన్) డైరెక్టర్ శ్రీ భాస్కర్ చౌదరి నెట్టెం, గెయిల్ (ఇండియా) లిమిటెడ్ (హ్యూమన్ రిసోర్సెస్) డైరెక్టర్ శ్రీ ఆయుష్ గుప్తా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (కోఆర్డినేషన్ అండ్ సీఎస్ఆర్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ బిభూతి రంజన్ ప్రధాన్, మహీంద్రా అగ్రి సొల్యూషన్స్ లిమిటెడ్ స్వతంత్ర డైరెక్టర్ డాక్టర్ పూర్వి మెహతా, హెచ్‌సీఎల్ టెక్ ఉపాధ్యక్షురాలు శ్రీమతి రుచి సాధన పాల్గొన్నారు.

ప్రాజెక్టు ప్రాముఖ్యత, అమలు సామర్థ్యం, భౌగోళిక, నేపథ్య అవసరాలు, పర్యవేక్షణ, మూల్యాంకనం, స్థిరత్వంపై మరింత శ్రద్ధ చూపటం ద్వారా సీఎస్ఆర్ నిర్ణయాల నాణ్యతను మెరుగుపరుస్తుందని బోర్డు భాగస్వామ్య చర్చలు స్పష్టం చేశాయి. సీఎస్ఆర్ నిబద్ధతలను స్థిరమైన అభివృద్ధి ఫలితాలుగా మార్చటంలో భాగస్వామ్యాలు, వృత్తిపరమైన సంస్థాగత విధానాల ప్రాముఖ్యతను ప్యానెల్ గుర్తించింది.

”ఎస్‌డీజీ ప్రాధాన్యతలతో కూడిన రంగాలవారీగా సీఎస్ఆర్ విధానాలు” అంశంపై సీఎస్ఆర్ ప్రాధాన్యతలు, రంగాలవారీ అభివృద్ధి ప్రాధాన్యతలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల మధ్య మరింత సమన్వయం ఉండాల్సిన అవసరాన్ని రెండో ప్యానెల్ చర్చ పరిశీలించింది. ఈ సెషన్‌కు భారతదేశ ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి అనితా షా అకెల్లా అధ్యక్షత వహించారు. విభిన్న అభివృద్ధి సవాళ్లు, సంస్థాగత సామర్థ్యాలు, స్థానిక ప్రాధాన్యతలను గుర్తించే రంగాలవారీ విధానాల అవసరాన్ని ఆమె ప్రస్తావించారు.

# ప్రకృతి వైపరీత్యాల పట్ల అవగాహన అవసరం

## అక్టోబర్ 13... అంతర్జాతీయ విపత్తు నివారణ దినం

ప్రపంచ వ్యాప్తంగా అనేకానేక దేశాల్లో ప్రకృతి విపత్తులు విరుచుకు పడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు సృష్టిస్తున్న విధ్వంసంతో ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతున్నాయి. మూడు దశాబ్దాలుగా ఐక్యరాజ్య సమితి అక్టోబర్ 13 నాడు ప్రకృతి విపత్తుల నివారణ దినోత్సవాల ద్వారా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. విపత్తుల ద్వారా కలిగే ఆర్థిక నష్టాలను తగ్గించుకునే అంశాన్ని నినాదంగా ఐరాస స్వీకరించింది. ఈ సందర్భంగా ప్రకృతి వైపరీత్యాల గురించి అవగాహన కలిగి ఉండడం అత్యంత అవసరం. సహజ, సాంస్కృతిక వనరులను ధ్వంసం చేసి, ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ప్రకృతి పరమైన, మానవ ప్రేరేపిత ఆకస్మిక సంఘటనలే విపత్తులు. విపత్తు అనే పదాన్ని ఇంగ్లిష్‌లో "డిజాస్టర్" అంటారు. ఇది మధ్యయుగం నాటి ఫ్రెంచి పదం. దీన్ని మూడు భాషా పదజాలల నుంచి గ్రహించారు. అవి..1) డస్ , ఆస్టర్ అనే గ్రీకు పదాలు. 2) డెస్ , ఆస్ట్రే అనే ఫ్రెంచ్ పదాలు. 3) డిస్, ఆస్ట్రో అనే లాటిన్ పదాలు గ్రీకు, లాటిన్ భాషల్లో డిజాస్టర్ అంటే 'దుష్టనక్షత్రం' అని అర్థం.

అలానే విపత్తు అనే పదాన్ని ఇంగ్లీషులో డిసాస్టర్ అంటారు.

విపత్తు ఒక భయంకర పరిస్థితి. దీంతో సాధారణ జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. పర్యా వరణ స్థితి విచ్ఛిన్నం అవుతుంది. ప్రాణాలను రక్షించడానికి, పర్యావరణాన్ని కాపాడటానికి అవసరమయ్యే అత్యవసర పరిణామమే విపత్తు". భూమి కంపించడం వలన జరిగే వైపరీత్యాలు, జల వైపరీత్యాలు, వడగాలి, అగ్ని, మహమ్మారులు, అంతరిక్షం, ప్రభావాల సంఘటనలు, సౌర జ్వాలలు తదితరాల ప్రభావం మానవ జీవితంపై అధికంగా ఉంది.

అలాగే ప్రపంచ యుద్ధాలు, ఉగ్రవాదం, నక్సలిజం, అణు బాంబులు లాంటివి మానవ కారక విపత్తులు విపత్తుల కిందకి వస్తాయి. విపత్తుల వల్ల 1) వరదలు - 30 శాతం; 2) తుపానులు - 21 శాతం; 3) కరవు- 19 శాతం; 4) మహమ్మారి వ్యాధులు - 15 శాతం; 5) భూకంపాలు, సునామీలు - 8 శాతం; 6) భూతాపాలు - 4 శాతం 7) హిమపాతాలు - 11 శాతం; 8) అగ్ని పర్వతాలు - 1 శాతం; 9) కీటక దాడులు - 1 శాతం; నష్టాలు సంభవిస్తున్నాయి.

ప్రపంచ బ్యాంకు నివేదికల ప్రకారం.. భారత దేశంలో సంభవించే విపత్తుల వల్ల జాతీయ ఆదాయంలో ఏటా 2.25 శాతం నష్టం వాటిల్లుతోంది. 'ప్రివెన్షన్ వెబ్ స్టాటిటిక్స్' రిపోర్ట్ ప్రకారం భారత్‌లో గత మూడున్నర దశాబ్దాలుగా దాదాపు 431 రకాల విపత్తులు సంభవించాయి. వీటి ద్వారా సుమారు 1,43,000 మంది ప్రాణాలు కోల్పోయారు. 15 కోట్ల మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వీటి ప్రభావానికి గురయ్యారు. సుమారు 4,800 కోట్ల అమెరికన్ డాలర్ల ఆస్తి నష్టం జరిగింది. ఇవి ఇప్పటి వరకు భారత దేశంలో, ప్రపంచంలోనూ ఎక్కువసార్లు సంభవించిన విపత్తు 'వరదలు'గా ఆ నివేదిక పేర్కొంది. ప్రకృతి విపత్తులకు భారత్ అంతులేని మూల్యాన్ని చెల్లిస్తోందని ఐక్యరాజ్య సమితి తాజా నివేదిక కుండ బద్దలు కొట్టింది. 20 ఏళ్లలో విపత్తుల కారణంగా దేశం 7,950 కోట్ల డాలర్లు (సుమారు రూ.5.91 లక్షల కోట్లు) నష్టపోయింది. ఆర్థిక నష్టాలు, పేదరికం, విపత్తులు- పేరిట 2017 ఆగస్టులో విడుదలైన నివేదికలో వివిధ, దేశాలు నష్ట పోయిన మొత్తం విలువ 2.9 లక్షల కోట్ల డాలర్లుగా తేలింది. అంతకు ముందు 20 ఏళ్ల వ్యవధి నష్టాల కంటే ఇది రెట్టింపు. ప్రపంచంలో విపత్తుల వల్ల నష్టపోతున్న వారి సంఖ్య 211 మిలియన్లు. విపత్తుల వల్ల భారత్ లో ఏటా 10 బిలియన్ల డాలర్ల నష్టం నష్టం జరుగుతోంది. మన దేశంలో భూమి వరదలకు 12శాతం ( 8శాతం) గురవుతోంది. డిజాస్టర్ నాలెడ్జ్ నెట్‌వర్క్ (ఐడీకేఎన్) రిపోర్టుల ప్రకారం దేశంలోని 29 రాష్ట్రాలు ఏడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఏదో ఒక విపత్తుకు తరచు గురవు తున్నాయి. దేశంలోని తీరప్రాంతం విశిష్టమైన ప్రకృతి వనరులు, జీవ వైవిధ్యానికి ప్రతీకలు. దేశ ఆర్థిక పరిపుష్టి లో విశేషమైన పాత్ర ఇవి

పోషిస్తున్నాయి. 13 రాష్ట్రాల్లోని 84 జిల్లాలు, అండమాన్, లక్షద్వీప్ కేంద్రపాలిత రాష్ట్రాల్లో 7,500 కిలోమీటర్లలో సముద్రతీర ప్రాంతం విస్తరించి ఉంది. వీటిల్లో గుజరాత్ (1,214 కి.మీ.) ఆంధ్రప్రదేశ్

(7 కి.మీ.) రాష్ట్రాల్లో అధికంగా తీరప్రాంతం ఉంది. అడవులు, చిత్తడి నేలలు, పగడపు దిబ్బలు, ఉప్పునీటి కయ్యలు, ఇసుక నేలలు వంటి జీవవైవిధ్యం తీరప్రాంతాల్లో ఉంటాయి. తీరంలోని యాభై కిలోమీటర్ల లోపు రమారమి ముప్పై కోట్ల మేర జనాభా నివసిస్తుంది. పర్యావరణ సమ తుల్యత లోపించడం వాతా వరణంలో పెనుమార్పులు విపత్తులకు మూలకారణం పెరుగుతున్న జనాభా, నగరీకరణ, తీర నియంత్రణ, నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న నిర్మాణాలు, పరిశ్రమలు, ఓడరేవుల విస్తరణ తీరంలోని జీవ వైవిధ్యానికి చేటు తెస్తూ సమస్యకు ఆజ్యం పోస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలైన తుపానులు, వరదల్లో మృతి చెందేవారికి ప్రభుత్వం నష్ట పరిహారాన్ని ఇస్తోంది. ప్రకృతి విపత్తులు, బీమా రంగం తన పాత్రను ఎక్కువగా నిర్వర్తిస్తూ వస్తోంది. ఈ రంగం, కొన్ని నష్టాలను పూడ్చుటకు తనవంతు సహాయ సహకారాలను అందిస్తుంది. హరికేన్లు, దావాలనాలు, ఇతర విపత్తులు సంభవించి నపుడు ఈ బీమా రంగం సాయం అందిస్తున్నది. 6.10.2009 నాటి రెవిన్యూ డిపార్ట్ మెంట్ జి.వో.23 ప్రకారం పూర్తిగా దెబ్బతిన్న ఇంటికి 5000, పాక్షికంగా దెబ్బతిన్న ఇంటికి 4000, బట్టల కోసం1500 పాత్రల కోసం1500, బియ్యం 20 కిలోలు, కిరోసిన్ 5 లీటర్లు ఇస్తారు. పర్యావరణ పరిరక్షణ చట్టం(1986)కు అనుబంధంగా తీరప్రాంత నియంత్రణ నిబంధనల పేరిట కోస్టల్ రెగ్యులేషన్ జోన్ (సీఆర్ జెడ్) నోటిఫికేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 1991లో అమలులోకి తీసుకొచ్చింది కొన్ని వర్గాల కార్య కలాపాలకు అడ్డుగా ఉన్న ఈ నిబంధనలను అమలు చేయడంలో ప్రభుత్వ వ్యవస్థ విఫల మయింది. విదేశీ నౌకా నియంత్రణ, పర్యా వరణ పరిరక్షణ, ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ అటవీ, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక చట్టాలు తీరప్రాంత పరిరక్షణతో ముడివడి ఉన్నాయి. 1991 నాటి నిబంధనల్లో తీరాన్ని మూడు విభాగాలు (సీఆర్ జెడ్-1,2,3)గా విభజించారు. ఆయా ప్రాంతాల్లో వివిధ నిర్మాణం చేపట్టడానికి నియంత్రణలు విధించాలి. అయితే పలు ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలు చేపట్టే కార్యక్రమాలకు ఇవి అడ్డుగా ఉన్నాయన్న ఉద్దేశంతో నిబంధనల్లో సవరణలు తీసు కొచ్చారు తప్పితే, నోటిఫికేషన్ లక్ష్యాలకు అనుగుణంగా నియమాలు అమలుచేసిన దాఖలాలు తక్కువ. సీఆర్జెడ్ నిబంధనలను 1991 మధ్య కాలంలో 12సార్లు సవరించి వివిధ అభివృద్ధి కార్యక్రమాల విస్తరణకు అనుమతించారు. ఈ నోటిఫికేషన్ అమలుచేయాల్సిన బాధ్యత రాష్ట్రాలదే. అయితే నిబంధనల అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నియంత్రించి ప్రకృతి వ్యవస్థలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. అభివృద్ధి పనుల పేరిట మడ అడవులు, హరితవనాలను విచ్చలవిడిగా ధ్వంసం చేస్తున్నారు. ప్రపంచ బ్యాంకు నిధులు, కేంద్ర ప్రభుత్వ గ్రాంట్లతో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విపత్తుల యాజమాన్య ప్రణాళికల అమలు మొక్కుబడిగా మారాయి. 2011 నుంచి కేంద్ర ప్రభుత్వ సాయంతో నిర్మించ తలపెట్టిన బహుళ ప్రయోజక షెల్టర్ల దశాబ్దాల క్రితంనాటి తుపాను షెల్టర్లు పూర్తిగా శిథిలమయ్యాయి.

ప్రకృతి వైపరీత్యాల నివారణకై, ప్రణాళికలను బడ్జెట్లో ప్రత్యేకంగా పొందుపరచాల్సిన అవసరం ఉంది. నష్టం అంచనాలో పౌరసమాజం, స్వచ్ఛంద సంస్థలను భాగ స్వాములను చేయాలి.

ప్రకృతి వ్యవస్థలకు హాని కలగకుండా, గొలుసుకట్టు హరిత వనాల పెంపకానికి, మడ అడవుల పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ వనీకరణ నిధులను సమకూర్చాలి.

వైపరీత్యాలకు దారి తీయకుండా తీరప్రాంత వన[illegible] జరిగేలా చర్యలను ప్రభుత్వం ముమ్మరం చేయాలి. [illegible] పైదాకా ప్రభుత్వ వ్యవస్థల స్పందన బట్టి బాధిత ప్రజ[illegible] విపత్తులను ఎదుర్కోగలమనే ధైర్యం కలిగించాలి.



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

# రాష్ట్రాభివృద్ధిలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి : పవన్ కల్యాణ్

## రూ.6,347 కోట్ల పెట్టుబడులతో కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం
## 18 వేల మందికి ఉపాధి అవకాశాలు
## పర్యావరణ పరిరక్షణతోనే పారిశ్రామిక ప్రగతి
## కాకినాడ సీఐఐ ప్రాంతీయ సదస్సులో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అమరావతి, అక్టోబర్ 12: పెట్టుబడులకు, పారిశ్రామిక అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ స్వర్గధామంగా మారుతోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. పెట్టుబడిదారులు కేవలం లాభాలకే పరిమితం కాకుండా రాష్ట్రానికి, ప్రజలకు ఏం చేయగలమనే ఆలోచనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణకు




ప్రాధాన్యమిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. అనుమతులు, ప్రోత్సాహకాల విషయంలో కూటమి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సోమవారం కాకినాడలోని జేఎన్‌టీయూలో జరిగిన సీఐఐ ప్రాంతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

కాకినాడ ప్రాంత పారిశ్రామిక ప్రగతిలో భాగంగా రూ.6,347 కోట్ల పెట్టుబడులతో చేపట్టిన ప్రాజెక్టులు కొత్త అవకాశాలకు పునాది వేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 16 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.4,652 కోట్ల పెట్టుబడులు రానుండగా, రూ.2,090 కోట్ల వ్యయంతో పూర్తయిన నాలుగు ప్రత్యేక ప్రాజెక్టులకు సంబంధించిన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కాకినాడ, పరిసర ప్రాంతాల్లో సుమారు 18 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. ఇవి యువతకు ఉద్యోగాలు కల్పించడంతోపాటు వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తాయని చెప్పారు.

సమష్టి కృషి, స్పష్టమైన లక్ష్యం, సంకల్పబలంతో అభివృద్ధి సాధ్యమని పవన్ కల్యాణ్ అన్నారు. ఒకప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కొన్న సింగపూర్ నేడు ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగిందని గుర్తుచేశారు. స్విట్జర్లాండ్ అభివృద్ధి నమూనా కూడా స్ఫూర్తిదాయకమన్నారు. పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని, వారు కూడా అదే నిబద్ధతతో రాష్ట్ర పురోగతికి తోడ్పడాలని కోరారు.

పారిశ్రామికవేత్తలు లాభనష్టాల లెక్కలకే పరిమితం కాకుండా దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ఆలోచించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా సమాజానికి మేలు చేయాలన్నారు. పారిశ్రామిక రంగంలో జంషెడ్జీ టాటా చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పరిశ్రమల స్థాపనను కేవలం పెట్టుబడుల కోణంలోనే కాకుండా వేలాది కుటుంబాల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే అవకాశంగా చూడాలని చెప్పారు.

ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో 2024 జూన్ నుంచి రాష్ట్రానికి 714 ప్రాజెక్టుల రూపంలో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. వీటిలో రూ.16.6 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రభుత్వ అనుమతులు లభించాయని, రూ.4.7 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభించే దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 7.1 లక్షల ఉద్యోగ అవకాశాలు ఏర్పడనున్నాయని వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1,053 కిలోమీటర్ల సుదీర్ఘ తీర ప్రాంతం రాష్ట్రానికి గొప్ప వరమని పవన్ కల్యాణ్ అన్నారు. మారిటైమ్, నౌకా నిర్మాణం, గ్రీన్ హైడ్రోజన్, రసాయనాలు, ఆహార శుద్ధి, ఆక్వా ఉత్పత్తుల రంగాల్లో పరిశ్రమలకు విస్తృత అవకాశాలున్నాయని తెలిపారు. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు ఈ పరిశ్రమలు దోహదపడతాయన్నారు.

పారిశ్రామిక అభివృద్ధితోపాటు పర్యావరణ పరిరక్షణకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పరిశ్రమలు ప్రారంభమైన తొలి రోజు నుంచే పర్యావరణ హిత విధానాలను అనుసరించాలని స్పష్టం చేశారు. తీర ప్రాంత రక్షణ, జీవవైవిధ్య పరిరక్షణ, పచ్చదనం పెంపునకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. గ్రేట్ గ్రీన్ వాల్ నిర్మాణానికి కూడా ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలోని గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పవన్ కల్యాణ్ చెప్పారు. పల్లె పండుగ, అడవితల్లి బాట కార్యక్రమాల ద్వారా గ్రామాలు, గిరిజన ఆవాసాల్లో రహదారులు, డ్రైనేజీలు, అనుసంధాన మార్గాలు, ఇతర సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు వివరించారు. ఈ రంగాల్లో రూ.1.70 లక్షల కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

పెట్టుబడిదారులు పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ, గిరిజన ప్రాంతాలపైనా దృష్టి సారించాలని కోరారు. దీనివల్ల అన్ని ప్రాంతాలకు అభివృద్ధి విస్తరించడంతోపాటు స్థానిక ప్రజలకు కొత్త ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకొచ్చే పెట్టుబడిదారులు భూమి, మౌలిక సదుపాయాలు, అనుమతులతోపాటు సుస్థిరమైన పాలనను కూడా పరిశీలిస్తారని పవన్ కల్యాణ్ అన్నారు. శాంతిభద్రతలు, ప్రభుత్వంపై నమ్మకం, పారదర్శకమైన విధానాలు పెట్టుబడులకు కీలకమని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం లేకపోవడంతో కొత్త పరిశ్రమలు రాకపోగా, ఉన్న కొన్ని పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోయాయని విమర్శించారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పిస్తూ, అనుమతులను వేగంగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమాంతరంగా సాగినప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణంలో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. స్థానిక యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగాలు కల్పించడం, వ్యాపారులకు అవకాశాలు సృష్టించడం, గ్రామీణులు, మత్స్యకారులతో కలిసి పనిచేయడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి రంగం, ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు. పర్యావరణ హిత పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్ర పురోగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి, కందుల దుర్గేష్, ఎంపీలు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, హరీష్ మాధుర్, సానా సతీష్ బాబు, సీఐఐ ఆంధ్రప్రదేశ్ వైస్ ఛైర్మన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం : దాస్యం వినయ్ భాస్కర్

హన్మకొండ, అక్టోబర్ 12:(నేటినిజం ప్రతినిధి)ప్రముఖ కార్మిక నాయకుడు, కమ్యూనిస్టు యోధుడు బీఆర్ భగవాన్ దాస్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అని మాజీ ప్రభుత్వ చీఫ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. సోమవారం బీఆర్ భగవాన్ దాస్ 23వ వర్ధంతి కార్యక్రమాన్ని హనుమకొండలోని బీఆర్ భగవాన్ దాస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులతో కలిసి వినయ్ భాస్కర్ భగవాన్ దాస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మీడియాతో వినయ్ భాస్కర్ మాట్లాడుతూ భగవాన్ దాస్ భౌతికంగా దూరమై 23 ఏండ్లు గడిచినా ఆయనను నేటికీ ప్రజలు స్మరించుకుంటూనే ఉన్నారని అన్నారు.

నీతి, నిజాయితీ, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేసిన బీఆర్ ఆశయాలు నేటికీ చిరస్మరణీయం అన్నారు. కార్మిక సమస్యలపై నిరంతరం కృషి చేసిన బీఆర్ భగవాన్ దాస్ సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కుల పరిరక్షణకు కృషి చేశారని అన్నారు. ప్రభుత్వ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించారని, ఆయన కాపాడిన స్థలంలోనే నేడు కాళోజీ కళాక్షేత్రం నిర్మించడం జరిగిందని చెప్పారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ స్థాపించి ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని పోరాడారని గుర్తు చేశారు.

నగరంలో పేదల ఇండ్ల స్థలాల కోసం, గుడిసె వాసులకు పట్టాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో భగవాన్ దాస్ ఉద్యమించారని అన్నారు. ఆయన ఆశయాలను నేటి తరం ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు కర్రె లక్ష్మణ్, ఎన్. రాజమౌళి, ఏదునూరి వెంకట్రాజం, ఏశబోయిన శ్రీనివాస్, బత్తిని సదానందం, మాలోతు శంకర్, మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, భగవాన్ దాస్ కుమారులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్, డాక్టర్ బి. రాజ్ సిద్దార్థ, బీఆర్ లెనిన్, మాజీ కార్పొరేటర్ లు మంచాల స్వామిచరణ్, జోరిక రమేష్, సారంగపాణి, జర్నలిస్టు నాయకులు పివి మదన్ మోహన్, తోట సుధాకర్, బొల్లారపు సదయ్య, బొడిగె శ్రీనివాస్, ఎండీ నయీం పాల్గొన్నారు

# కేసుల పరిష్కారంలో ఏపీ ఆర్టీఐ కమిషన్‌కు జాతీయ గుర్తింపు

## ఆన్‌లైన్‌లోనే 95 శాతం విచారణలు..
## సెప్టెంబరు నాటికి 7,034 కేసుల పరిష్కారం
## ఆర్టీఐ చట్టాన్ని దుర్వినియోగం చేసే 9 మంది బ్లాక్‌లిస్ట్..
## జిల్లాకు ఇద్దరు ప్రత్యేక అధికారుల నియామకానికి ప్రతిపాదనలు




అమరావతి, అక్టోబర్ 12: సమాచార హక్కు చట్టం కింద నమోదయ్యే కేసుల పరిష్కారంలో ఆంధ్రప్రదేశ్ సమాచార కమిషన్ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిందని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ వజ్జా శ్రీనివాసరావు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విచారణలను వేగవంతం చేయడంతో పాటు, సామాన్య ప్రజలకు సమాచార హక్కు చట్టాన్ని మరింత చేరువ చేశామని వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు నెలాఖరు వరకు 7,034 కేసులను పరిష్కరించినట్లు వివరించారు.

సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర సమాచార కమిషన్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్జా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం సామాన్యుడి చేతిలో శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. ఉన్నత స్థాయి అధికారుల పనితీరుపై కూడా సమాచారం పొందే అవకాశం ఈ చట్టం కల్పిస్తోందన్నారు. ప్రజలకు సకాలంలో సమాచారం అందేలా, పెండింగ్ కేసులు తగ్గేలా కమిషన్ ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.

# యువతకు నూతన ఉద్యోగావకాశాలు: భారతీయ రైల్వేల్లో 3,548 గ్రాడ్యుయేట్ స్థాయి ఎన్‌టీపీసీ ఖాళీల భర్తీకి విడుదలైన ప్రకటన

న్యూఢిల్లీ, అక్టోబర్ 12:భారతీయ రైల్వే పరిధిలోని రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు (ఆర్ఆర్‌బీలు) విడుదల చేసిన కేంద్రీకృత నియామక నోటిఫికేషన్ (సీఈఎన్) నంబర్ 06/2026 ద్వారా ఎన్‌టీపీసీ(నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్)- గ్రాడ్యుయేట్ విభాగం కింద 3,548 పట్టభద్రుల స్థాయి ఖాళీలను ప్రకటించింది. ఈ నియామకం ద్వారా అర్హులైన పట్టభద్రులకు భారతీయ రైల్వేలో ఉద్యోగం చేసేందుకు, దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ సేవా సంస్థలలో ఒకటైన రైల్వేల సమర్థవంతమైన నిర్వహణలో భాగస్వాములు కావడానికి గొప్ప అవకాశం లభిస్తుంది.

ఈ నియామక ప్రక్రియ చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్, గూడ్స్ ట్రైన్ మేనేజర్, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ అనే నాలుగు రకాల ఉద్యోగ విభాగాలకు వర్తిస్తుంది. ఈ ఉద్యోగాలు వాణిజ్య సేవలు, రైలు కార్యకలాపాలు, ఖాతాలు (అకౌంట్స్), పరిపాలనా విభాగాలలో విస్తృతమైన ఉద్యోగ జీవన అవకాశాలను అందిస్తూ దేశవ్యాప్తంగా రైల్వే సేవల సమర్థవంతమైన నిర్వహణకు తోడ్పడతాయి.

మొత్తం 3,548 ఖాళీలలో అత్యధికంగా 2,750 పోస్టులు గూడ్స్ ట్రైన్ మేనేజర్ విభాగానికి కేటాయించారు. సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ విభాగంలో 371, జూనియర్ అకౌంట్స్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్ విభాగంలో 300, చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ విభాగంలో 127 ఖాళీలు ఉన్నాయి. ఇవి పట్టభద్రులకు రైల్వే కార్యకలాపాలు, పరిపాలనకు సంబంధించిన వివిధ క్రియాశీల విభాగాలలో పనిచేసే అవకాశాన్ని కల్పిస్తాయి.

ఏడో కేంద్ర వేతన సంఘం (సీపీసీ) నిబంధనల ప్రకారం ఈ పోస్టులకు ప్రారంభ మూల వేతనం వర్తిస్తుంది. చీఫ్ కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్ పోస్టుకు ఆరో వేతన స్థాయి కింద నెలకు రూ. 35,400 ప్రారంభ మూల వేతనం ఉండగా.. మిగిలిన మూడు విభాగాల పోస్టులకు ఐదో వేతన స్థాయి కింద నెలకు రూ. 29,200 ప్రారంభ మూల వేతనం లభిస్తుంది. వర్తించే అలవెన్సులు, సేవా షరతులు సంబంధిత నిబంధనల ప్రకారం ఉంటాయి.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ 2026 అక్టోబర్ 8న ప్రారంభమైంది. అర్హులైన అభ్యర్థులు 2026 నవంబర్ 6 రాత్రి 11:59 గంటల వరకు తమ దరఖాస్తులను సమర్పించొచ్చు. పరీక్ష రుసుము చెల్లించడానికి చివరి తేదీ 2026 నవంబర్ 8 కాగా దరఖాస్తుల సవరణ ఆప్షన్ నవంబర్ 9 నుంచి నవంబర్ 18 వరకు అందుబాటులో ఉంటుంది. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి. పోస్టుల వారీగా కూడా నిర్దేశిత అర్హతలు ఉంటాయి. 2027 జనవరి 1 నాటికి నిర్ణీత వయోపరిమితి 18-33 సంవత్సరాలుగా ఉంది. నిబంధనల ప్రకారం అర్హత గల వర్గాలకు తగిన వయోపరిమితి సడలింపులు వర్తిస్తాయి. ఎంపిక ప్రక్రియలో మొదటి దశ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ-1), రెండో దశ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ-2) ఉంటాయి. నిబంధనల ప్రకారం ఆ తర్వాత డాక్యుమెంట్ వెరిఫికేషన్, వైద్య పరీక్షలను నిర్వహిస్తారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.